ప్రజాశక్తి
సోమవారం 31 జులై 2023 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

మాట్లాడుతున్న నారా లోకేస్

పాదయాత్రకు భారీగా హాజరైన ప్రజలు, ఇన్‌సెట్‌లో అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌ను సన్మానిస్తున్న నారా లోకేస్

టిడిపి అధికారంలోకి రాగానే..

అద్దంకిని ప్రకాశంలో చేరుస్తాం

వార్త ▶ 2లో

- అద్దంకిలో పిల్ల సైకోల సంగతి తేలుస్తా
- సమస్యల పరిష్కారం బాధ్యత నాదే
- గొట్టిపాటిని భారీ మెజార్టీతో గెలిపించాలి
- 2024లో వచ్చేది తెలుగుదేశం ప్రభుత్వమే
- బహిరంగ సభలో నారా లోకేష్

అద్దంకిని ప్రకాశం జిల్లాలో చేరుస్తాం : నారా లోకేష్

ప్రజాశక్తి-అద్దంకి

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే అద్దంకిని ప్రకాశం జిల్లాలో చేరుస్తామని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. అద్దంకి పాత బస్టాండ్ సెంటర్లో జరిగిన యువ గళం పాదయాత్ర సభలో ఆయన మాట్లాడారు. అద్దంకి పులి గొట్టిపాటి రవికుమార్‌ను నాలుగు సార్లు గెలిపించిన ఎంతో ఘన చరిత్ర ఉన్న అద్దంకి గడ్డ పై పాదయాత్ర చెయ్యడం నా అదష్టం.అన్నారు. ఎన్నికల ముందు ఎంత మంది పిల్లలు ఉంటే అందరికీ అమ్మఒడి అన్నాడు. దానిని అర్ధ ఒడి చేసాడని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చాకా కండిషన్స్ అప్లై అంటూ ఒక బిడ్డకే అని అర్ధ ఒడి చేసాడని విమర్శించారు.

విద్యుత్ ఛార్జీలు 9 సార్లు బాదుడే బాదుడు, ఆర్టీసీ బస్ ఛార్జీలు 3 సార్లు పెంచాడన్నారు. 100 సంక్షేమ కార్యక్రమాలు రద్దు చేసిన మొదటి సీఎం ఈ జగన్.జగన్ మహిళల్ని నమ్మించి మోసం చేసాడు.సంపూర్ణ మద్యపాన నిషేధం తర్వాతే ఓట్లు అడుగుతా అన్నాడు. ఇప్పుడు ఏం మొఖం పెట్టుకొని ఓట్లు అడుగుతున్నాడు. 45 ఏళ్లకే బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళలకు పెన్షన్ అన్నాడు. పెన్షన్ దేవుడెరుగు పాపం మహిళలు దాచుకున్న అభయహస్తం డబ్బులు 2500 కోట్లు కొట్టేసాడన్నారు. ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి అమ్మఒడి ఇస్తా అని మోసం చేసాడని ధ్వజమెత్తాడు.వివిధ వర్గాలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదన్నారు.

ఉమ్మడి ప్రకాశంలో 4 సీట్లు గెలిపించారని, 2024 లో అధికారంలోకి వచ్చిన వెంటనే ఉమ్మడి జిల్లా ని గుండెల్లో పెట్టుకొని అభివద్ధి చేస్తామన్నారు..2019 లో వైసిపి 8 సీట్లు గెలిచింది. టిడిపి ఎమ్మెల్యే ని కూడా పార్టీలో చేర్చుకున్నారు. మొత్తం 9 ఎమ్మెల్యేలు ఉన్నారు అంటే జిల్లా ఎలా అభివద్ధి చెందాలి? అభివద్ధి లో దూసుకెళ్ళాలి. కానీ ఉమ్మడి ప్రకాశం జిల్లా కి జగన్ పీకింది ఏంటి?అని ఎద్దేవా చేశారు.

వెలిగొండ ప్రాజెక్ట్ పనులు ఏడాదిలో పూర్తి చేస్తా అన్నాడు. పూర్తి చేసాడా ? 6 సార్లు తేదీలు మార్చాడు. నడికుడి – కాళహస్తి పనులు రైల్వే పనులు పూర్తి అయ్యాయా?అన్నారు. నేషనల్ ఇండస్ట్రియల్ మ్యానుఫ్యాక్చరింగ్ జోన్ ఏర్పాటు కోసం టిడిపి హయాంలో భూసేకరణ చేయగా ఆ ప్రాజెక్ట్ జగన్ పాలనలో ఎత్తిపోయిందన్నారు. దొనకొండ వద్ద ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటు చెయ్యాలని టిడిపి ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసిందన్నారు.దీన్ని అటకెక్కించారన్నారు.. గుండ్లకమ్మ ప్రాజెక్టు. గేటు కొట్టుకుపోగా వదిలేయడంతో . ప్రాజెక్టు లోని నీరు మొత్తం ఖాళీ చేసారన్నారు.. 2 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే ఏషియన్ పల్ప్ అండ్ పేపర్ పరిశ్రమను తీసుకొస్తే జగన్ తన్ని తరిమేసాడన్నారు.. అది వచ్చి ఉంటే ఇక్కడ సుబాబుల్, జామాయిల్ రైతులకు ఎంతో మేలు జరిగేదన్నారు. టిడిపి. ప్రకాశం పులి గొట్టిపాటి రవి రూ.2 వేల కోట్లతో అద్దంకిని అభివద్ధి చేసారన్నారు.ప్రతి గ్రామంలో సిసి రోడ్లు వేసాం. సింగరకొండలో ఐటిఐ కాలేజ్, ఇండోర్ స్టేడియం నిర్మించడం జరిగిందన్నారు.

అద్దంకి ప్రజల దాహం తీర్చేందుకు 80 కోట్లతో శాశ్వత తాగునీటి పథకం ఏర్పాటు చేసామన్నారు.

రైతులు పండించిన పంట దళారుల చేతికి వెళ్లకుండా రైతులే అమ్ముకునే విధంగా అన్న గారి సంత ఏర్పాటు చేసారన్నారు.. రాష్ట్రంలోనే ఎక్కువ సీఎం రిలీఫ్ ఫండ్ ఇచ్చింది అద్దంకికే. సాగు నీరు అందించడం కోసం లిఫ్ట్ ఇరిగేషన్లు ఏర్పాటు చేసాం. ఎస్సి, ఎస్టీ మత్స్యకారులకు 90 శాతం సబ్సిడీతో మోపిడ్ లు, ఆటోలు, వలలు అందజేశాం.నియోజకవర్గంలో ఎక్కువగా ఎన్టీఆర్ జలసిరి బోర్లు వేయించామని తెలిపారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తరువాత అద్దంకి పరిస్థితి ఏంటిఅద్దంకి ప్రజలంటే జగన్ కి కోపం అందుకే అద్దంకి ని అనాధ గా వదిలేసాడు. పెద్ద సైకో ని చూసి పిల్ల సైకోలు రెచ్చిపోతున్నారు. అద్దంకిని అడ్డగోలుగా దోచుకున్నారు. పిల్ల సైకోల ఇసుక దోపిడీ ఏ రేంజ్ లో ఉందో తెలుసా గుండ్లకమ్మ డ్యామ్ గేట్లు కొట్టుకుపోయి ఏడాది అయ్యింది. గేట్లు బిగిస్తే ఇసుక దోపిడీ సాధ్యం కాదని గేట్లు పెట్టడం లేదు. పిల్ల సైకోల కక్కుర్తి వలన గుండ్లకమ్మ నదిపై ఆధారపడిన 13 గ్రామాల మత్స్యకారులు రోడ్డున పడ్డారు. సెంటు స్థలాల్లో భారీ స్కాం చేసారు పిల్ల సైకోలు. ఎకరం రూ. 10 లక్షలకు కొని ప్రభుత్వానికి రూ.27 లక్షలకు అమ్మేసారు. చేపల చెరువులు మొత్తం పిల్ల సైకోలు కబ్జా చేసారు రేషన్ బియ్యాన్ని కూడా వదలలేదు పిల్ల సైకోలు. కస్యపురం గ్రామంలో శివారెడ్డి రైస్ మిల్లు ద్వారా వందల టన్నుల రేషన్ బియ్యాన్ని అక్రమంగా పక్క రాష్ట్రానికి తరలిస్తున్నారు. దేవుడ్ని కూడా వదలలేదు సింగరకొండ పుణ్యక్షేత్రంలో కాంట్రాక్టు పోస్టుల దగ్గర నుండి, షిఫ్ట్ ఆపరేటర్, వాచ్మెన్, అంగన్వాడీ పోస్టుల వరకూ ప్రతి ఉద్యోగానికి ఒక రేటు పెట్టి అమ్మేస్తున్నారు పిల్ల సైకోలు.

గ్రానైట్ యజమానులను బెదిరించి లారీకి రూ.10 వేలు వసూలు చేస్తున్నారు పిల్ల సైకోలు. మల్లాయపాలెంలో ఎస్టీలు నివసిస్తున్న 15 ఎకరాల్లో గ్రానైట్ ఉండటంతో వారిని ఖాళీ చేయించి 15 ఎకరాలు కబ్జా చేసారు ఈ పిల్ల సైకోలు. భూకబ్జాలకు లెక్కేలేదు, వెంచర్ వెయ్యాలంటే వైసిపి పిల్ల సైకోలకు కప్పం కట్టాల్సిందే. జగన్ పనైపోయింది. 2024 లో గెలిచేది టిడిపి నే. అద్దంకి లో భారీ మెజారిటీ తో మన పులి రవి గారిని గెలిపించండి. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే అద్దంకి ని ప్రకాశం జిల్లాలో కలుపుతాం.

వైవి సుబ్బారెడ్డి తండ్రి పేరు మీద ఏర్పాటు చేసిన పోలిరెడ్డి కోరిశపాడు లిఫ్ట్ ప్రాజెక్ట్ జగన్ పూర్తి చెయ్యలేదని, టిడిపి గెలిచిన వెంటనే పూర్తి చేస్తామన్నారు.ఆపేసిన భవనాశి రిజర్వాయర్ పనులు పూర్తిచేస్తాం. వాటర్ గ్రిడ్ పథకం ద్వారా ప్రతి ఇంటికి కుళాయి ద్వారా తాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు.. గుండ్లకమ్మ నదిపై కొత్త బ్రిడ్జ్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు.. గుండ్లకమ్మ ప్రాజెక్టు ముంపు గ్రామల ప్రజలకు అన్ని మౌలిక వసతులతో కాలనీలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. సాగర్ మైనర్, మేజర్ కాలువలను పూర్తిస్థాయిలో రిపేర్ చేసి ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామన్నారు. సుబాబులు, జామాయిల్, . టన్నుకి 5 వేలు ఇస్తానని జగన్ మోసం చేసాడని, మీ పెట్టుబడి తగ్గించి గిట్టుబాటు ధర అందిస్తామన్నారు.

అద్దంకి పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఇటుక పరిశ్రమకూ టఅధికారంలోకి వచ్చిన వెంటనే ప్రోత్సాహకాలు కాపాడతామన్నారు.

ప్రకాశం జిల్లా ని ఫార్మా హబ్ గా తయారు చేసే బాధ్యత నాదని అన్నారు.అద్దంకి ప్రజల కోసం పోరాడినందుకు గొట్టిపాటి రవిని వేధించారని . సమస్యలు పరిష్కరించమని ప్రశ్నించినందుకు వెంటాడారన్నారు. అయినా మన పులి తగ్గుతుందా? ఒక్కటే చెప్పాడు ఫ్లూటు జింక ముందు ఊదు పులి ముందు కాదని అంటూ అభివర్ణించారు. యువగళం పాదయాత్ర ఉందని తెలిసి ఫ్లెక్సీలు చింపుతారు. పాదయాత్ర ను అడ్డుకుంటాం అని సవాళ్ల విసురుతున్నారు అంట అని ఎద్దేవా చేశారు.

పార్టీ నాయకుల్ని ఇబ్బంది పెట్టే వారిని చట్టాన్ని అతిక్రమించి కేసులు పెట్టిన వారిని వదిలి పెట్టనని హెచ్చరించారు. . అనంతరం పాదయాత్ర భవాని సెంటర్ నుండి తిమ్మాయపాలెం వరకు భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. తిమ్మాయపాలెం గ్రామంలో తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు పూల మాలలతో ఘనంగా ఆహ్వానించారు.మహిళలు మంగలు హారతులు ఇచ్చి బాణసంచా సాదరస్వాగతం పలికారు. అనంతరం శంకరాపురం వైపు యువగళం పాదయాత్ర కొనసాగునున్నది. శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్. పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు, కొండపి ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్ధన్‌రావు, మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు, టిడిపి ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు నూకసాని బాలాజీ, బీసీ, జనార్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, బిఎన్. విజయకుమార్, ముత్తుముల అశోక్‌రెడ్డి, ఇన్‌ఛార్జులు ఎంఎం.కొండయ్య, ఎరిక్షన్‌బాబు, దర్శి కోఆర్డినేటర్ దామచర్ల సత్య,హర్షిణి విద్యాసంస్థల అధినేత గోరంట్ల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నా జీవితం ప్రజాసేవకే అంకితం : గొట్టిపాటి

నా చివరి రక్తం బొట్టు ఉన్నంతవరకు అద్దంకి నియోజకవర్గ ప్రజాసేవకే అంకితం చేస్తానని.. నియోజకవర్గాన్ని అభివద్ధి పథంలో నడిపిస్తానని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. పాదయాత్ర సభలో ఆయన గద్గస్వరంతో మాట్లాడారు. అద్దంకిలో నాలుగేళ్ల తర్వాత జరిగిన భారీబహిరంగ సభకు అధ్యక్షత వహించి మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం యువగళం పాదయాత్రకు అడుగడుగునా ఎన్నో ఇబ్బందులు పెట్టిందన్నారు.వాటిని అధిగమించి 2200 కిలోమీటర్లు పాదయాత్ర జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ కొనసాగిస్తున్నారన్నారు. మరో తొమ్మిది నెలల్లో ఎన్నికలు వస్తున్నాయని తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వస్తుందన్నారు. టిడిపిలో చేరిన తరువాత నియోజక వర్గంలో 16 వేల పింఛన్లు అందించామన్నారు., మరో నాలుగు వేల మందికి ముఖ్యమంత్రి సహాయనిది నుంచిసాయం అందించా మన్నారు. అద్దంకి పట్టణానికి తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం 80 కోట్ల రూపాయలతో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వంలో అమ్మ వరము పథకం నుంచి నిధులు మంజూరు చేయించామన్నారు. అధికారంలోకి రాగానే ఇంటింటికి కుళాయిలు తాగునీరు. అందిస్తామన్నారు. పెదనాన్న గొట్టిపాటి హనుమంతరావు ఒక మాట చెప్పాడని ఏమి ఉన్నా లేకపోయినా అభిమానాన్ని పోగొట్టుకోకూడదని...డబ్బు సంపాదించుకోవచ్చు అని పోగొట్టుకోవచ్చని అది శాశ్వతము కాదన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రజలకు సేవ చేసేందుకు ప్రజలు నాకు ఈ అవకాశం ఇచ్చారని అన్నారు.

ఆయాలకు ప్రోత్సాహకం

ప్రజాశక్తి-మద్దిపాడు

క్విన్ టైటాన్స్ రోటరీక్లబ్ ఆధ్వర్యంలో మద్దిపాడులో గల నాగార్జున స్కూల్‌లో ఆయాలను ప్రోత్సహించే కార్యక్రమం నిర్వహించారు. క్లబ్ ప్రెసిడెంట్ ముప్పరాజు మేఘన మాట్లాడుతూ వివిధ స్కూల్లో ఆయాలుగా పనిచేసే వారిలో నూతన ఉత్తేజాన్ని నింపేందుకు ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. అందులో భాగంగానే నాగార్జున స్కూల్లో ఈ కార్యక్రమం చేశామని తెలిపారు. పాఠశాలలో పని చేస్తున్న ఆయాల సేవలకు గాను విద్యార్థులందరితో చప్పట్లు కొట్టించి వారిని అభినందించారు. అదే విధంగా విద్యార్థులకు వ్యక్తిగత పరిశు భ్రతపై అవగాహన కల్పించారు. విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకునేందుకు సోపులు అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ టి.అఖిల్, సిహెచ్ నందిని, షేక్ రూహిన్, షేక్ ముస్కాన్, ఎం.జాహ్నవీ, ఎన్.మనీషా, పి.అజయ్, మనోజ్, వంశీకృష్ణ, అజిత్ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-సింగరాయకొండ

స్థానిక గీతా మందిరంలో ఆదివారం ఏర్పాటు చేసిన రోటరీ క్లబ్ సమావేశంలో శింగరాయకొండకు నూతనంగా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మాలె రంగారెడ్డి, కార్యదర్శిగా పంతగాని వెంకటేశ్వర్లు, కోశాధికారిగా నాగసూరి వెంకటసుబ్బారావులను నియమించారు. కార్యక్రమానికి ఇన్స్టాలేషన్ అధికారిగా శివన్నారాయణ, పబ్లిక్ ఇమేజ్ ఇంచార్జ్ సాంబశివరావు, అసిస్టెంట్ గవర్నర్ ప్రసాద్, వైఎస్ఆర్సిపి కొండేపి నియోజకవర్గ ఇన్చార్జి వరికూటి అశోక్‌బాబు ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. అనంతరం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో బాలికలకు సైకిల్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. రోటరీ క్లబ్ చేస్తున్న సేవలు ఎవరు మరిచిపోనివి అన్నారు. ప్రభుత్వ సహాయంతో పాటు ఇలాంటి దాతలు ద్వారా అభివృద్ధి చెందటం ఆనందకరమన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు జెట్టి సూర్య చంద్రశేఖర్ రెడ్డి, సుల్తాన్, సుభాని తదితరులు పాల్గొన్నారు.

మద్ధాళికి పురస్కారం అందజేత

ప్రజాశక్తి-చీమకుర్తి

అభయ కళారాధన సంస్థ అధ్యక్షులు మద్ధాళి మాధవరావు అటల్ బిహారి వాజ్‌పేయ్ స్ఫూర్తిసేవా పురాస్కారం అందుకున్నారు. ఆదివారం హైదరాబాదులో సరస్వతి పరిషత్ భవనంలో లోటస్ కల్చర్ ఆర్గనైజేషన్, లిటిల్ చాంప్స్ అకాడమి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పురస్కారం అందుకున్నారు. మద్ధాళి మాధవరావు అభయ కళారాధన సంస్థ ఆధ్వర్యంలో గత 20ఏళ్లుగా పలు రంగాలలో అందించిన సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం అందజేశారు. ఆయనకు ప్రశంశాపత్రాలు అందజేసి, అనంతరం వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాగురూ కరాశీలు సిఐ డాక్టర్ ఏరుకొండసీతయ్య, జూనియర్ శోభన్‌బాబు, జబర్దస్త్ ఫేమ్ నాని, అకాడమీ నిర్వాహకులు వసుంధర, బుచ్చేశ్వరరావు, వంశీకృష్ణ, మల్లెపూల వెంకటరమణ, మహేష్‌ల చేతుల మీదుగా పురస్కారం అందకున్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

- ఆరోగ్యశ్రీ ద్వారా జర్నలిస్టులకు హెల్త్ కార్డులు
- ప్రెస్ అకాడమి చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు

ప్రజాశక్తి-మార్కాపురం

జర్నలిస్టుల ఆరోగ్య సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నట్లు సి.రాఘవాచారి ఆంధ్రప్రదేశ్ మీడియా అకాడమి చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు తెలిపారు. ఈ విషయమై ఆరోగ్యశ్రీ ట్రస్ట్‌తో మాట్లాడినట్లు పేర్కొనర్నారు. అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టులకు హెల్త్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకుంటే మంజూరవుతాయని చెప్పారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జర్నలిస్టుల ఆత్మీయ సమావేశం ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు దొండపాటి మోహన్‌రెడ్డి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ సమాజానికి మెరుగైన జర్నలిజం అవసరమన్నారు. అందు కోసం ప్రతి శనివారం విలువైన వ్యక్తులతో జర్నలిస్టుల కోసం శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిజమైన వార్తల కోసం పని చేసినప్పుడే జర్నలిస్టులకు ఆత్మ సంతృప్తి ఉంటుందన్నారు. జర్నలిస్టులు వాస్తవాలు ఇచ్చేందుకు ప్రయత్నించినా కొన్ని మీడియా సంస్థల యాజమాన్యాలు ఏదొక రాజకీయ పార్టీకి కొమ్ము కాయడంతో వాస్తవాలను సైతం వక్రీకరించేలా జర్నలిస్టులపై ఒత్తిడి తీసుకొస్తున్నట్లు తెలిపారు. వెలుగులోకి వస్తాయన్నారు. వాస్తవాలు ప్రచురితమైతేనే జర్నలిస్టులకు సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. జర్నలిస్టులు రాసిన పుస్తకాలను గ్రంథాలయాల ద్వారా కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. అనంతరం సీనియర్ జర్నలిస్టులు మూల అల్లూరిరెడ్డి, వెన్నా వెంకటేశ్వరరెడ్డి, ఓరుగంటి మల్లిక్, ఎన్‌వి.రమణ, జిఎల్. నరసింహా, కెవి.సత్యనారాయణ, మద్దెల కేశవను సత్కరించారు. తొలుత తొలితరం పాత్రికేయులు, స్వాతంత్ర్య సమరయోధులు స్వర్గీయ ఓరుగంటి వెంకటరమణయ్య కాంస్య విగ్రహానికి పూలమాల వేసి స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు డి.మోహన్‌రెడ్డి, కార్యదర్శి వెన్నా వెంకటేశ్వరరెడ్డి, గౌరవ్యాక్షులు కె.రామకృష్ణ, ఓరుగంటి మల్లిక్, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

డార్విన్ సిద్ధాంతాన్ని కొనసాగించాలి - జెవివి

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

పాఠ్యపుస్తకాల సిలబస్ నుంచి తొలగించిన డార్విన్ సిద్ధాంతాన్ని తిరిగి కొనసాగించాలని, విజ్ఞాన్ ప్రసార్ వంటి సైన్స్ సంస్థలను నిర్వీర్యం చేయరాదని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్రహ్మణ్యం కోరారు. జన విజ్ఞాన వేదిక మార్కాపురం, తర్లుపాడు, పెద్దారవీడు, యర్రగొండపాలెం మండలాల కమిటీలను మార్కాపురంలోని శ్రీ రెడ్డి మహిళా జూనియర్ కళాశాలలో ఆదివారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జెవివి జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ బి.శరత్ మాట్లాడుతూ ప్రతి పౌరుడు శాస్త్రీయ ఆలోచనలు, మానవతా విలువలు కలిగి ఉండాలన్నారు. జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యవర్గ సభ్యులు యు వెంకట్రావు మాట్లాడుతూ ఆగస్టు 12,13 తేదీల్లో నిర్వహించనున్న జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పబ్లిక్ నోటీసు

నా పేరుతో గల ది 18/08/ 1988 తేదీన వ్రాయబడిన దస్తా వేజు (డాక్యుమెంట్ నెంబర్ 12336/1988) వారం క్రితం జిరాక్స్ కోసం బాపట్ల జిల్లా చీరాల గడియార స్తంభం సెంటర్లో వెళు తుండగా పోయినది. దొరికిన వారు నాకు అందజేయవలసినదిగా ప్రార్ధన ఇట్లు

కన్నెగంటి ధన శిఖామణి
వుడ్ నగర్ చీరాల,
సెల్ నెం:-9966306262

ప్రజాశక్తి 3
సోమవారం 31 జులై 2023

గ్రామ సమాఖ్య నిధులు స్వాహా

ప్రజాశక్తి-పొన్నలూరు

మడలంలోని జడ్ మేకపాడు గ్రామ సమాఖ్యకు సంబంధించిన రూ.73,500లను ఆ గ్రామానికి చెందిన వ్యక్తి డ్రా చేసి స్వాహా చేశాడు. సమాఖ్య నిధులు డ్రా చేసిన విషయం గ్రామ సమాఖ్య వివోకు తెలియకుండా ఎపిఎం సురేష్ కలిసి డ్రా చేశారని డ్వాక్రా మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ సమాఖ్యలోని నిధులు ఎలా డ్రా చేస్తారని డ్వాక్రా మహిళలు, వివోలు ఎపిఎం దృష్టికి తీసుకెళ్లగా ఆ వ్యక్తి నుంచి డ్రా చేసిన నిధులు జమ చేయిస్తానన్నారు. మండలంలో ఇలాంటి సంఘటనలు ఎన్ని గ్రామ సమాఖ్యలలో జరుగుతున్నాయోనని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. వివోకు సుమారు 15 నెలల నుంచి జీతాలు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే సంబంధిత అధికారులు చొరవ తీసుకొని గ్రామ సమాఖ్యలో డ్రా చేసిన నిధులు వసూలు చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

ఆర్కే భార్య శిరీషపై ఛత్తీస్‌గఢ్‌లో కేసు నమోదు

ఎన్ఐఏ విచారణలో ఆమెతో పాటు దుడ్డు ప్రభాకర్ తదితరులు

ప్రజాశక్తి-టంగుటూరు

మావోయిస్టు అగ్రనేత అక్కిరాజు హరగోపాల్ రామకృష్ణ అలియాస్ ఆర్కే భార్య పద్మ అలియాస్ శిరీషలపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అధికారులు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం జగదల్‌పూర్‌లో కేసు నమోదు చేశారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని ఆలకూర పాడులో విప్లవ రచయితల సంఘం నేత, ఆర్కే తోడల్లుడు గంగుల కళ్యాణరావు పలు విషయాలను ప్రజాశక్తికి వివరించారు. ఈ నెల 21వ తేదీన ఎన్ఐఏ అధికారులు హఠాత్తుగా ఆలకూరపాడు గ్రామానికి వచ్చి నిమిషాల వ్యవధిలోనే శిరీషను తమ వెంట తీసుకెళ్లడం సంచలనం కలిగించింది. అక్కడ నుంచి శిరీషను ఛత్తీస్‌గఢ్‌కు తీసుకెళ్లిన అధికారులు పలు కోణాల్లో విచారణ చేపట్టి కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఎన్ఐఏ అధికారులు శిరీష, దుడ్డు ప్రభాకర్‌లతో పాటు విజయవాడ పరిసరాలలో మావోయిస్టు సానుభూతిపరులుగా ఉన్న దేవేంద్ర, పద్మ, దేవేందర్‌లను కూడా అదుపులోకి తీసుకున్నారన్నారు. ఏ ఆధారాలతో శిరీషపై కేసు నమోదు చేశారని ప్రశ్నించగా ఎన్ఐఏ ఆరోపణలను కళ్యాణ్‌రావు వివరించారు. ఆర్కే డైరీ ఆధారంగా కొన్ని కీలక అంశాలు ఎన్ఐఏ అధికారులకు లభించినట్లు చెప్పారు. శిరీషతో పాటు దుడ్డు ప్రభాకర్ కూడా మావోయిస్టుల కోసం పని చేస్తున్నారని, అందుకోసం వీరు పెద్ద మొత్తంలో నిధులు అందుకుంటున్నారని ఎన్ఐఎ అనుమానిస్తోందని చెప్పారు. 2019లో ఛత్తీస్‌గఢ్, తిరియా ఎన్ కౌంటర్లలోనూ వీరు పాల్గొన్నారని, మావోయిస్టుల ఎంపికలోనూ వీరు కీలకంగా పని చేస్తున్నట్లు తెలిపారు. మావోయిస్టుల వారోత్సవాల సందర్భంగా భారీ కుట్రకు ప్లాన్ చేసినట్లు ఎన్ఐఏ బృందం అనుమానిస్తున్నట్లు తెలిపారు. ఈ ఆరోపణలపై ఈ నెల 31వ తేదీ వరకు శిరీష తదితరులపై ఎన్ఐఏ అధికారుల ఆధ్వర్యంలో విచారణ కొనసాగుతుందని చెప్పారు. అనంతరం ఆగస్టు 1వ తేదీన వారిని జైలుకు తరలించే అవకాశం ఉండగా అక్కడ వారిని తాము కలిసి అన్ని విషయాలపై చర్చిస్తామని చెప్పారు. ఎన్ఐఏ అధికారులు కేవలం అనుమానంతోనే శిరీషను అరెస్టు చేసి తీసుకెళ్లారని, ఇది చాలా దుర్మార్గపు చర్యగా అభివర్ణించారు. శిరీష తదితరులపై ఎన్ఐఏ అధికారులు పెట్టేవన్నీ బూటకపు కేసులే అని, శిరీషతో పాటు ఎన్ఐఏ అధికారులు అరెస్టు చేసిన వారందరినీ వెంటనే విడుదల చేయాలని కళ్యాణ్‌రావు డిమాండ్ చేశారు.

మణిపూర్ ఘటనపై వైసిపి, టిడిపి, జనసేన స్పందించాలి

ప్రజాశక్తి-భట్టిప్రోలు

రమేష్ రాంజీ

మణిపూర్‌లో జరిగిన ఘటనపై ఏపిలో ప్రధాన పార్టీలైన టిడిపి, వైసిపి, జనసేన పార్టీలు స్పందించాలని జై భీం భారత్ పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షులు, న్యాయవాది దోవా రమేష్ రాంజీ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం భట్టిప్రోలులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మణిపూర్ లో మేటీలు రాజ్యాంగ, మానవ హక్కులను ఉల్లంఘిస్తూ మైనారిటీలపై దాడులు, హత్యా చారాలకు పాల్పడుతున్నారని, అటువంటి దుశ్చర్యలు దేశవ్యాప్తంగా అన్ని రాజకీయ పార్టీలు స్పందించి ముక్తకంఠంతో వ్యతిరేకిస్తుం డగా మన రాష్ట్రంలో ప్రధాన పార్టీలైన తెలుగుదేశం, వైసిపి, జనసేన పార్టీలు మాత్రం నేటికీ స్పందించక పోవటం బిజెపి పట్ల వారి వైఖరిపై ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారని ఆగ్రహం వెలుబుచ్చారు. ఐక్యరాజ్య సమితి సైతం ఈ ఘటనను ఖండిస్తే మన ప్రధాన పార్టీలు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. మణిపూర్‌లో మైనారిటీ, గిరిజన వర్గాలైన కుకి, నాగ, క్రైస్తవ వర్గాలపై జరిగే ఈ దాడులుపై స్పందించకపోతే ప్రజల విశ్వాసం కోల్పోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

విద్యుత్ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్

కార్మికులను పర్మినెంట్ చేయాలి

ప్రజాశక్తి-బాపట్ల

సమావేశంలో మాట్లాడుతున్న సందీప్

ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్డ్ కమిటీ ఆధ్వర్యంలో బాపట్ల పుచ్చలపల్లి సుందరయ్య ప్రజాసంఘాల కార్యాలయంలో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో బాపట్ల డివిజన్ కమిటీ అధ్యక్షులు పి సందీప్ మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి విద్యుత్ యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇచ్చినట్లు తెలిపారు. ప్రధానంగా విద్యుత్ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి. విద్యుత్ రెగ్యులర్ ఉద్యోగులకు 45 శాతం ఫిట్‌మెంట్‌తో పిఆర్‌సి ఇవ్వాలని, జేఎల్‌ఎం గ్రేడ్-2 ఎనర్జీ అసిస్టెంట్లకు ప్రొబేషన్ పిరియడ్ డిక్లేర్ చేయాలని కోరారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. సమస్యలు పరిష్కరించకుంటే విద్యుత్ కార్మికులు సమ్మె బాట పట్టి ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమావేశంలో కమిటీ కార్యవర్గ సభ్యులు వినోద్, సిరాజ్, ప్రతాపరెడ్డి, ఆంజనేయులు, లక్ష్మణ్, ప్రదీప్, సుభాని, సురేష్, నాగరాజు పాల్గొన్నారు.

వృద్ధులకు చేతి కర్రలు పంపిణీ

ప్రజాశక్తి-పర్చూరు

నాగభైరు రామ తులసమ్మ ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఆమె కుమారుడు, రోటరీ అధ్యక్షులు నాగభైరు శ్రీనివాసరావు ఆర్థిక సహకారంతో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక నేతాజీ వృద్ధాశ్రమలోని 30మంది వృద్ధులకు చేతి కర్రలు, పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ మానవసేవే మాధవసేవ అని అన్నారు. తనకు ఉన్నంతలో ఇతరులకు సహాయపడటం మనసుకు సంతృప్తిని ఇస్తుందని అన్నారు. ఆశ్రమంలోని వృద్ధులు ప్రశాంత జీవనం కొనసాగించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి పంబి సదానందరెడ్డి, ప్రతినిధులు కోటా శ్రీనివాసరావు, గడ్డిపాటి శ్రీనివాసరావు, కోమటి ఆంజనేయులు, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఉరేసుకున్న యువతి షేక్ నూర్ అప్సర

ఉరేసుకొని యువతి ఆత్మహత్య

ప్రజాశక్తి-ముండ్లమూరు

కుటుంబ కలహాల కారణంగా యువతి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం ముండ్లమూరులో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ముండ్లమూరు గ్రామానికి చెందిన షేక్ కాలేషా కుమార్తె షేక్ నూర్అప్సర అద్దంకి మండలంలోని వేలమూరిపాడు గ్రామానికి చెందిన కాళింది కిరణ్ కుమార్‌ను గత పది సంవత్సరాల క్రితం కులాంతర ప్రేమ వివాహం చేసుకుంది. ఈమెకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఆదివారం ఉదయం అద్దంకి నుంచి ముండ్లమూరు వచ్చిన నూర్అప్సర తమ సొంత ఇంటి స్థలం వద్ద వేప చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న ఎస్ఐ వెంకటకృష్ణయ్య సంఘటన స్థలానికి చేరుకొని వీఆర్ఏ సమక్షంలో మృతదేహాన్ని కిందకి దింపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వెంకట కృష్ణయ్య తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దర్శి ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు.

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి

ప్రజాశక్తి-ముండ్లమూరు

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి చెందిన సంఘటన ముండ్లమూరు మండలంలోని వేంపాడు గ్రామంలో ఆదివారం జరిగింది. అందిన వివరాల ప్రకారం.. వేంపాడు గ్రామానికి చెందిన బాల వెంకటేశ్వరరావు(36) తన తమ్ముడు పొలంలోని మిరప తోటకు నీళ్ల కట్టడానికి వెళ్లాడు. మందు బస్తా తెచ్చే క్రమంలో కాలుజారి విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్‌పై చెయ్యి పడటంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దర్శి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారని ఎస్ఐ వెంకట కృష్ణయ్య తెలిపారు.

లోకేష్ పర్యటనలో ట్రాఫిక్ అంతరాయం

ప్రేక్షకపాత్ర వహించిన పోలీసులు ● టిడిపి కార్యకర్తలే ట్రాఫిక్ నియంత్రించిన వైనం

ప్రజాశక్తి-అద్దంకి

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర అద్దంకి పట్టణంలో 2వ రోజు కొనసాగింది. ఈ క్రమంలో ఆదివారం పూర్తిస్థాయిలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఇంత జరుగుతున్నా పోలీసులు ట్రాఫిక్ క్లియర్ చేయకుండా స్థానిక భవాని సెంటర్లోని చెక్‌పోస్ట్ వద్ద ప్రేక్షకపాత్ర వహించారు. ఈ క్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు సింగరకొండ వైపు నుంచి వచ్చే భారీ వాహనాలు కార్ల వాహనదారులకు రేణింగవరం వైపు నుంచి నేషనల్ హైవేకి వెళ్లవలసిందిగా కార్యకర్తలు సూచించారు. మూడున్నర గంటల ప్రాంతంలో నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో లోకేష్ బస చేసిన ప్రాంతానికి తరలి వెళ్లారు.

సంఘటనా స్థలంలో మృతిచెందిన వ్యక్తి

ట్రాక్టర్‌పై నుంచి జారిపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కొత్తపట్నం

ట్రాక్టర్‌పై నుంచి జారిపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన కొత్తపట్నం పంచాయతీ కార్యాలయం వద్ద ఆదివారం చోటు చేసుకుంది. ట్రాక్టర్‌లో కొత్తపట్నం ముస్లిం కాలనీకి నాపరాళ్లను తీసుకొస్తున్నారు. మార్గమధ్యంలో కొత్తపట్నం పంచాయతీ కార్యాలయం టర్నింగ్ వద్ద ట్రాక్టర్ మలుపు తిరుగుతుండగా ట్రక్కు వెనుకటైరు ఒకవైపు లేచింది. దీంతో ట్రక్కులో ఉన్న గోగుల వెంకటేశ్వర్లు(45) అనే వ్యక్తి జారి మెట్లకు తల గుద్దుకోవడంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే చనిపోయాడు. మృతుడిది ఒంగోలు సత్యనారాయణ పురం ఒకటో లైన్. ఈ సంఘటన జరిగిన గంటసేపు వరకు మృతదేహాన్ని ఎవరూ పట్టించు కోలేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేసినట్లు చెబుతు న్నారు. పంచాయతీ ఆఫీస్ మలుపువద్ద రోజు రోజుకూ దుకాణాలు పెరిగిపోతూ ట్రాఫిక్కుకు అంతరాయం కలుగుతున్నా పంచాయతీ అధికారులు మాత్రం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్ వైద్యశాలకు తరలిస్తున్నారు. ట్రాక్టర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాంబశివరావు తెలియజేశారు.

ద్విచక్ర వాహనాలు ఢీ వ్యక్తి మృతి

ప్రజాశక్తి- గిద్దలూరు రూరల్

మృతుడు భాస్కర్‌రెడ్డి

గిద్దలూరు మండలం బురుజు పల్లి, బురుజుపల్లి తండా గ్రామాల మధ్య రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తున్న గిద్దలూరు మండలం కొత్తకోటకు చెందిన ఎదురు భాస్కర్‌రెడ్డి(45) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందారు. రెండో వ్యక్తి తీవ్ర గాయాలతో గిద్దలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

బైకును ఢీకొన్న బస్సు.. ఒకరు మృతి

ప్రజాశక్తి-పొదిలి

పట్టణంలోని మార్కాపురం అడ్డరోడ్డు వద్ద బైక్‌పై ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులను బస్సు ఢీ కొట్టిన ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన ఆదివారం జరిగింది. ఒంగోలుకు చెందిన సెంట్రింగ్ మేస్త్రీ ఢాకా రాజశేఖర్‌రెడ్డి తన దగ్గర పనిచేస్తున్న పొదిలి బెస్తపాలెంకు చెందిన ఏడుకొండులు, శివాజీలు ముగ్గురు వ్యక్తులు పల్సర్ బైక్‌పై వద్దిమడుగు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆర్‌టిసి బస్సును ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాజశేఖర్‌రెడ్డిని పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే తీవ్రంగా గాయపడిన రాజశేఖర్‌రెడ్డి పొదిలి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మిగిలిన వారు స్వల్పగాయాలతో బయటపడ్డారు. పొదిలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పట్టణ నడిబొడ్డున 'ప్రభుత్వ' మద్యమా?

విస్తుపోతున్న ప్రజలు.. మండి పడుతున్న మహిళలు ● నేడు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్న స్థానికులు ● షాపును నిలిపివేయాలి: సిపిఎం

ప్రజాశక్తి-చీరాల

పట్టణ నడిబొడ్డులో ఉన్న నెహ్రూ కూరగాయల మార్కెట్ సమీపాన ప్రభుత్వ మద్యం దుకాణం ఏర్పాటు చేయడాన్ని ఆ ప్రాంత వాసులందరూ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. నిత్యం కూరగాయల మార్కెట్ వద్ద మహిళలతో రద్దీగా ఉండే ప్రాంతంలో మందుబాబులకు కేంద్రంగా నిలిచే విధంగా ప్రభుత్వ మద్యం దుకాణం ఆ ప్రాంతంలో ఏర్పాటు చేయటం ఏంటని అందరూ ఆశ్చర్యపోతున్నారు. ఓవైపు కస్తూర్బాగాంధీ బాలికల హైస్కూల్, మరోవైపు కూరగాయల మార్కెట్, ఆ వెంటనే పచారి దుకాణాలు, మార్కెట్‌కు సమీపంలో భావనారుషి దేవస్థానం వీటన్నింటికీ ప్రధాన కేంద్రంగా ఉన్న ప్రాంతంలో ఎలాంటి బహిరంగ ప్రకటన లేకుండా, గుట్టు చప్పుడు కాకుండా, మహిళల సమస్యలను గుర్తించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేయాలని చూస్తున్న మద్యం దుకాణాన్ని తక్షణమే నిలుపుదల చేయాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు. ఈ విషయంపై సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరగనున్న స్పందన కార్యక్రమానికి ఆ ప్రాంతవాసులు అందరూ హాజరై తమ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లనట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో నేడు జరగనున్న మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఈ సమస్యపై కౌన్సిలర్లు చర్చిస్తారో లేక పట్టీపట్టనట్లు వ్యవహరిస్తారో వేచి చూడాల్సిఉంది.

కూరగాయల మార్కెట్ వద్ద ప్రారంభించబోతున్న ప్రభుత్వ మద్యం దుకాణం

మద్యం దుకాణం తక్షణమే నిలిపివేయాలి: సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి ఎన్ బాబురావు

నిత్యం మహిళలతో, పాఠశాల, కళాశాలకు వెళ్లే విద్యార్థినులతో రద్దీగా ఉండే కూరగాయల మార్కెట్ సమీపంలో ప్రధాన రహదారిపై ప్రభుత్వం మద్యం దుకాణం ఏర్పాటు చేయటం అప్రజాస్వామికమని, ప్రభుత్వ ఉన్నత అధికారులు పర్యవేక్షించి తక్షణమే మద్యం దుకాణ ఏర్పాట్లను నిలిపివేయాలని సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి ఎన్ బాబురావు అన్నారు. ఆ ప్రాంతవాసులు ఎదుర్కొంటున్న సమస్యపై సిపిఎం అన్ని వేళలా ఆ ప్రాంత వాసులకు అండగా ఉంటుందని స్పష్టం చేశారు. తక్షణమే మద్యం దుకాణ పనులు నిలుపుదల చేయకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

మహిళలకు ఇబ్బంది కలిగిస్తే సహించేది లేదు: ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షులు గుమ్మడి ఏసురత్నం

ప్రభుత్వ మద్యం దుకాణం కూరగాయలు మార్కెట్ వద్ద ఏర్పాటు చేయటం మంచి పద్ధతి కాదని, తక్షణమే ప్రభుత్వం పునరాలోచించి మరో ప్రాంతంలో దుకాణాన్ని ఏర్పాటు చేసుకోవాలని ప్రజావేదిక రాష్ట్ర అధ్యక్షులు గుమ్మడి ఏసురత్నం అన్నారు. మహిళలకు, విద్యార్థినులకు, ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే తాము ఆందోళన కార్యక్రమాలు చేపడతామని, తక్షణమే ప్రభుత్వ అధికారులు ప్రజల విన్నపాలను దృష్టిలో ఉంచుకొని మద్యం షాపును ఏర్పాటు ప్రయత్నాన్ని విరమించుకోవాని సూచించారు. ప్రజలకు ఇబ్బంది కలిగే విధంగా ప్రభుత్వ అధికారుల ప్రవర్తన ఉంటే తప్పనిసరిగా తాము ఆందోళన కార్యక్రమాలు చేస్తామని స్పష్టం చేశారు.

అన్నదానం చేస్తున్న దాతలు

దాతల సహకారంతో అన్న క్యాంటీన్

ప్రజాశక్తి-బాపట్ల

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలలో భాగంగా బాపట్లలో తెలుగుదేశం పార్టీ బాధ్యులు వేగేశన నరేంద్రవర్మ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్ నిర్విఘ్నంగా కొనసాగుతోంది. ఆదివారం 273వ రోజుకు చేరింది. తాజాగా మహ్మద్ అజ్ మల్ షా తల్లిదండ్రులు మహ్మద్ ఆలమ్ షా - సుల్తానా సహకారంతో 250 మంది పేదలకు అన్నదానం చేశారు. పేదల ఆకలి తీర్చే కార్యక్రమానికి సహకరిస్తున్న దాతలకు నరేంద్రవర్మ కృతజ్ఞతలు తెలిపారు.

అవార్డును అందుకుంటున్న గ్రేస్ ఫౌండేషన్ అధినేత జోత్స్న

యశ్వంత్ రాయ్‌కు 2023-సూపర్ కిడ్ అవార్డు

ప్రజాశక్తి-భట్టిప్రోలు

మండలంలోని పల్లెకోన గ్రామానికి చెందిన గ్రేస్ ఫౌండేషన్ అధినేత కైతేపల్లి షాలేం రాజ్, జోత్స్నల కుమారుడు యశ్వంత్ రాయ్ 2023-సూపర్ కిడ్ అవార్డును అందుకునట్లు ఫౌండేషన్ సభ్యులు యాన్నం సురేష్ తెలిపారు. లిటిల్ సామ్స్ అకాడమీ ఆఫ్ ఇండియా, లోటస్ కల్చరల్ ఆర్గనైజేషన్ హైదరాబాద్ వారు నిర్వహించిన ఈ కార్యక్రమంలో యశ్వంత్ రాయ్‌కి సేవా కార్యక్రమాలకు గాను అవార్డును అందించినట్లు పేర్కొన్నారు. చిన్నారులను ప్రోత్సహించేందుకు గాను సంస్థ 40 మందికి ఈ అవార్డులు అందించగా వీరిలో ఒకటి యశ్వంత్‌కు దక్కడం అభినందనీయమన్నారు. ఈ మేరకు పలువురు అభినందించారు.

ఆత్మీయ సమావేశంలో అనుచరులతో డాక్టర్ పాలేటి రామారావు

అనుచరులతో ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి-వేటపాలెం

వేటపాలెం మండలం పందిళ్లపల్లి గ్రామంలో పత్తిపాటి సుబ్బారావు నివాసం వద్ద మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు తన అనుచరులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని కోరారు. పలువురు కార్యకర్తలు మాట్లాడుతూ మీరు శాసనసభ్యుడిగా పని చేసిన సమయంలోనే పందిళ్లపల్లి గ్రామం అన్ని విధాలా అభివృద్ధి చెందిందని అన్నారు. కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ కుల మతాలకు అతీతంగా చీరాల నియోజకవర్గం ఎల్లప్పుడూ ప్రశాంతంగా ఉండేదని వారు అన్నారు రానున్న ఎన్నికలలో మేమందరం మీ వెంటే నడుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు కీర్తి వెంకట్రావు, మసనం శీను, ఆవుల రామారావు, పయ్యల కోటేశ్వరరావు, కీర్తి చిన్న, కీర్తి బ్రహ్మయ్య, పలువురు కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ రివర్స్ పాలనలో..
నిలిచిన నీటి ప్రాజెక్టులు: నరేంద్రవర్మ

ప్రజాశక్తి-బాపట్ల

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వేగేశన నరేంద్రవర్మ

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం రివర్స్ టెండర్ల పేరుతో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలు నిలిచి పోయాయని తెలుగుదేశం పార్టీ బాపట్ల నియోజకవర్గం బాధ్యులు వేగేశన నరేంద్రవర్మ విమర్శించారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాగునీటి వ్యవసాయం సంక్షోభం దిశగా పయనిస్తోందన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చాక జగన్మోహన్‌రెడ్డి అనాలోచిత నిర్ణయాలు, కక్షపూరిత విధానాలతో రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలు నిలిచిపోయి రైతులకు తీరని నష్టం జరుగుతోందని అన్నారు. చంద్రబాబు పాలనలో ఏడాది కాలంలోనే పట్టిసీమ ప్రాజెక్టును పూర్తి చేసినట్లు గుర్తు చేశారు. రాష్ట్రానికి జీవనాడి పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం సహకారం అంతంతమాత్రంగా ఉన్నా పట్టుదలతో దాదాపు 70శాతం వరకు పనులు పూర్తి చేసిన ఘనత టీడీపీ ప్రభుత్వానిదేనన్నారు. వైసీపీ ప్రభుత్వ నాలుగేళ్ల పాలనలో కేవలం 3 శాతం పనులు మాత్రమే చేశారన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలో ఐదేళ్లలో సాగునీటి ప్రాజెక్టులపై రూ.21 వేల 445 కోట్లు ఖర్చు చేస్తే, వైసీపీ ప్రభుత్వం నాలుగేళ్లలో ఖర్చు చేసింది కేవలం 4 వేల 375 కోట్లు మాత్రమే అన్నారు. దీన్నిబట్టి చూస్తే వైసీపీ ప్రభుత్వం రైతు సంక్షేమానికి ఏ మేరకు పాటుపడుతుందో విశదమవుతుందన్నారు. సమావేశంలో బాపట్ల పట్టణ పార్టీ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, బాపట్ల మండల పార్టీ అధ్యక్షుడు ముక్కామల సాంబశివరావు పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్య సిబ్బంది, నిర్వాహకులు

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-బాపట్ల

స్వచ్ఛంద సేవా సంస్థలు నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని లయన్స్ క్లబ్ ఆఫ్ బాపట్ల టౌన్ అధ్యక్షులు శిఖరం ఫణిరాజశయన్ అన్నారు. ఆదివారం క్లబ్ ఆధ్వర్యంలో ఏషియన్ హాస్పిటల్ సౌజన్యంతో భవిష్య మాంటిసోరి (సాధన స్కూల్ క్యాంపస్) ప్రాంగణంలో వెరికోస్ వెయిన్స్ (నరాలు, పిక్కల బలహీనత)కు ఉచిత వైద్య శిబిరాన్ని ఏషియన్ హాస్పిటల్ వైద్యులు, క్లబ్ సభ్యులతో కలిసి ఆయన ప్రారంభించారు. ప్రధానంగా నరాలు, పిక్కలు, కాళ్ల రుగ్మతలకు సంబంధించిన పరీక్షలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. శిబిరంలో వందమందికి వెరికోస్ వెయిన్స్ (నరాలు పిక్కల బలహీనత)కు ఏషియన్ హాస్పిటల్ వైద్యులు ఉచిత పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి ఉషారాణి, కోశాధికారి శివరామకృష్ణ, రీజియన్ చైర్మన్ గోపాళం రఘుపతి రావు, అలపర్తి శ్రీనివాస్‌రావు, యజ్ఞ నారాయణ, గుండ్రెడ్డి సత్యనారాయణ, సింగంసెట్టి సుబ్బారావు, శివ నాగేశ్వరమ్మ, లక్కాకుల వెంకటరావు, వక్కలగడ్డ శ్రీనివాసరావు, ఇక్కుర్తి శ్రీనివాసరావు, వంకాయలపాటి హరిబాబు, సుధాకర గుప్త, రజనీకాంత్, బాషా పాల్గొన్నారు.

వేటపాలెంలో శాంతి ర్యాలీ

మణిపూర్‌లో అమానవీయ ఘటనలకు ముక్తకంఠంతో ఖండన

ప్రజాశక్తి-వేటపాలెం

మణిపూర్‌లో జరుగుతున్న దురాగతాలను నిరసిస్తూ వేటపాలెంలో ఆదివారం క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడా లేని అమానవీయమైన ఘటనలు మణిపూర్లో తలెత్తితే వెలుగు చూడటానికి 90 రోజులు పైగా పట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. హిందూ మతమే ధ్యేయంగా పనిచేస్తున్న కేంద్ర ప్రభుత్వ చర్యలను శాంతికాముకులైన ప్రజలందరూ ముక్తకంఠంతో ఖండిస్తున్నారన్నారు. మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దారుణమైన దమనకాండకు మతోన్మాద శక్తులే కారణంగా పేర్కొన్నారు. చిన్న చిన్న తెగలను విచ్ఛిన్నం చేసి తమ పబ్బం గడుపుకోవాలని కేంద్ర ప్రభుత్వం చూస్తున్నదని విమర్శించారు. దాదాపు 200 మందితో మొదలైన ర్యాలీ దేశాయిపేట నుంచి వేటపాలెం మండల కేంద్రమైన అంబేద్కర్ విగ్రహం వరకు కొనసాగించారు. ఈ సందర్భంగా జస్టిస్ మణిపూర్‌లో ప్రజా స్వామ్యాన్ని కాపాడండి అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. కార్యక్రమంలో పాస్టర్లు సత్యం, అచ్చయ్య, మాజీ వైస్ ఎంపీపీ మార్పు గ్రగోరి, చేగుడి సురేష్ బాబు, బెంజి, ఏలియా తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజలు

పసుపు సైన్యంతో కిక్కిరిసిన అద్దంకి

- లోకేష్ బహిరంగ సభకు భారీగా తరలిన జనం
- యువగళం పాదయాత్రను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న గొట్టిపాటి
- అద్దంకిలో ముగిశాక దర్శి నియోజకవర్గంలోకి వెళ్లిన లోకేష్

సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొట్టిపాటి

అద్దంకి వీధుల్లో పోటెత్తిన టిడిపి కార్యకర్తలు

ప్రజాశక్తి-అద్దంకి

లోకేష్ యువగళం పాదయాత్ర నేపథ్యంలో పసుపు సైన్యంతో అద్దంకి కిటకిటలాడింది. బాణాసంచాలు, టపాసుల మోతలతో మార్మోగింది. రెండు రోజులుగా నియోజకవర్గ పరిధిలోని టిడిపి కార్యకర్తలు తమ సత్తాను చాటారు. పాదయాత్ర నియోజకర్గంలో ప్రవేశించినపుడు ఘన స్వాగతం పలికారు. అడుగడుగునా మహిళలు లోకేష్‌కు హారతులు పట్టారు. పాదయాత్ర కనీవినీ ఎరుగని రీతిలో సాగిందనే చర్చ జిల్లా నేతల మధ్య నడిచింది. అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్,ఆయన ముఖ్య అనుచరగణం పాదయాత్రను ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవంతం అయ్యేందుకు సర్వశక్తులు ఒడ్డారు.లోకేష్ కూడా అద్దంకి నియోజకవర్గంలో ఊహించని రీతిలో జరిగిందని స్థానిక నేతలను అభినందించారు. శనివారం రాత్రికి అద్దంకి చేరుకుని బసచేసిన లోకేష్ ఆదివారం తిరిగి పాదయాత్రను ప్రారంభించారు. అద్దంకి పాతబస్టాండు సెంటర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారు. సభకు నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. పట్టణంలోని అన్ని వార్డుల నుంచి జనం వచ్చారు. ఎటుచూసినా టిడిపి కార్యకర్తలే. అద్దంకి-నార్కట్‌పల్లి ప్రధాన రహదారి నాలుగు వరుసలూ టిడిపి అభిమానులతో నిండిపోయింది. రాకపోకలు ఆగిపోయాయి. ప్రజలు లోకేష్ ప్రసంగం ఆసక్తిగా విన్నారు. పాదయాత్ర ఉద్దేశాన్ని వివరించిన లోకేష్ సైకో జగన్‌ను సాగనం పాలన్నారు. సభికులనుంచి విశేషస్పందన వచ్చింది. పాదయాత్రలో రామనగర్ వాసుల సమస్యలు విన్నారు. అక్కడ నుంచీ పాత బస్టాండు సెంటర్ వరకూ సాగిన పాదయాత్రలోనూ వేలాది మంది పాల్గొని లోకేష్ వెంట నడిచారు. ఉమ్మడిప్రకాశం జిల్లాలో అద్దంకి నియోజకవర్గంలో పాదయాత్రకు అపూర్వ స్పందన వచ్చింది. ఉమ్మడిప్రకాశం జిల్లా నేతలు అందరూ యాత్రలో పాల్గొన్నారు. సభ అనంతరం పాదయాత్ర మొదలైంది. భవానీ సెంటర్, తిమ్మాయపాలెం మీదుగా దర్శినియోజకవర్గం లోకి చేరింది.అద్దంకి నుంచి సుమారు 13 కిలోమీటర్లు దూరం పాదయాత్ర చేసి నేతలందరూ వేంపాడుకు చేరుకున్నారు. శంకరాపురం సరిహద్దుల్లో దర్శి నియోజకవర్గ నేతలు, స్థానిక నేతలు దారిపొడవునా లోకేష్‌కు స్వాగతం పలికారు. యువగళం దర్శినియోజకవర్గ కో ఆర్డినేటర్‌గా ఉన్న దామచర్ల సత్య కీలకపాత్ర పోషించారు. ముండ్లమూరు మండలం వేంపాడులో లోకేష్ రాత్రికి బసచేశారు.

గజమాలతో లోకేష్‌కు సన్మానం

గొర్రెల కాపరుల పిల్లలతో నారా లోకేష్

నారాలోకేష్‌తో కరచాలనం చేస్తున్న మహిళలు

బస్సు ఎక్కి లోకేష్‌ను తిలకిస్తున్న నాయకులు

పాదయాత్రలో ఎమ్మెల్యే రవికుమార్ తనయుడు

బదిలీ అయిన ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలి: యుటిఎఫ్

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

బదిలీ అయిన మరియు ప్రమోషన్‌పై బదిలీ అయిన ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు చెల్లించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఒవి. వీరారెడ్డి, ఎస్.రవి కోరారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి వర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె. శ్రీనివాసరావు మాట్లాడుతూ అధికారంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం సిపిఎస్‌ను వారంలో రద్దు చేస్తామని చెప్పి నాలుగేళ్ల గడిచిందన్నారు. సిపిఎస్‌ను రద్దు చేయకపోగా జిపిఎస్‌ను అమలు చేయడం దారుణమన్నారు. 2003 డిఎస్‌సి వారికి సిపిఎస్‌ను రద్దు చేస్తూ సెంట్రల్ గవర్నమెంట్ ఉత్తర్వులు ఇచ్చినా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం సిపిఎస్‌ను రద్దు చేయలేదన్నారు. జిల్లా అధ్యక్షుడు ఒవి. వీరారెడ్డి మాట్లాడుతూ బదిలీపై ప్రమోషన్‌అయిన ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు చెల్లించాలన్నారు. అందుకు జిల్లా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి వీరాంజనేయులు దేశ రాజకీయ పరిస్థితులు, పరిణామాలపై మాట్లాడారు. ఈ సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షుడు జె కేశవరాజు, సహ అధ్యక్షుడు ఎస్‌కె.అబ్దుల్ హై, కోశాధికారి చిన్న స్వామి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

ఎపి విద్యుత్తు ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో సిఐటియు కార్యాలయంలో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జివి.రాగయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈపాటికే ఉన్న విద్యుత్తు పవర్ జెఎసి, విద్యుత్తు ఉద్యోగులు, కార్మికులు, జెఎల్ఎం, జిఆర్-2(ఎనర్జిఅసిస్టెంట్)ల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం వెనుక పట్టుపట్టిందని తెలిపారు. కమిటీలు, చర్చలు పేరుతో కాలయాపన చేస్తూ విద్యుత్తు ఉద్యోగ, కార్మిక వర్గాన్ని మభ్యపెడుతోందన్నారు.. స్ట్రగుల్స్ కమిటీ రాష్ట్ర వైస్ చైర్మన్ కట్టా నాగరాజు మాట్లాడుతూ విద్యుత్తు సంస్థల్లో దశాబ్దాల కాలం నుంచి పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులందరినీ తెలంగాణ తరహాలో రెగ్యులర్ చేయాలన్నారు. కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేసి విద్యుత్తు సంస్థలే నేరుగా కార్మికులకు వేతనాలు చెల్లించాలని కోరారు. ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్త కోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యుత్తు ఉద్యోగులు, కార్మికుల పోరాటానికి అన్ని విధాల మద్దతు, సంఘీభావం ప్రకటించారు. ఈ సమావేశంలో పాల్గొన్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జివి.కొండారెడ్డి మాట్లాడుతూ పోరుబాటలోపట్టిన విద్యుత్తు ఉద్యోగ, కార్మికసంఘాలలను అభినందించారు. పోరాటాలు నిర్వహిస్తున్న విద్యుత్తు ఉద్యోగ, కార్మిక సంఘాలకు తమ పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. అనంతరం ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ స్థానిక నాయకత్వాన్ని ఎంపిక చేశారు. చైర్మన్‌గా జివి.రాగయ్య, జనరల్ సెక్రటరీగా కసుకుర్తి రవి కుమార్, కన్వీనర్‌గా దేపూరి శ్రీనివాసరావు, కోశాధికారిగా కుంచాల పాపారావును ఎంపిక చేశారు. రాష్ట్ర కమిటి పిలుపులో భాగంగా ఉద్యోగ, కార్మికుల సమస్యలపై ఈనెల 31న జిల్లా కలెక్టర్‌కు సమస్యతో కూడిన వినతిపత్రం అందజేయాలని, వచ్చేనెల 2న విద్యుత్తు ట్రాన్స్‌కో, డిస్కంల సూపరిండెంట్ ఇంజనీర్ల కార్యాలయాల వద్ద ధర్నాలు చేయాలని 7న తిరుపతిలోని ఎస్‌పిడిసిఎల్ కెంపెనీ కార్యాలయం వద్ద ధర్నా చేయాలని రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానించారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు పివిఆర్.చౌదరి, టి.శ్రీనివారావు, పి. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

గురుస్వామికి సన్మానం

పొదిలి : కొనకనమిట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించిన దాసరి గురుస్వామి సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. సైన్ ఉపాధ్యాయుడిగా పని చేస్తూ పదోన్నతిపై కొమరోలు మండలం అల్లినగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా వెళ్లిన జెవివి జిల్లా ఉపాధ్యక్షులు దాసరి గురుస్వామి అభినందన కార్యక్రమం స్థానిక పెన్షనర్ల భవనంలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం.రమేష్, జెవివి పొదిలి డివిజన్ ప్రధాన కార్యదర్శి బి. దేవ ప్రసాద్ , ఐజాక్ బాబు, , రమేష్, బాల కాశిరెడ్డి, శ్రీనివాసరావు, చౌదరి, సానికొమ్ము తిరుపతి రెడ్డి, విక్రమార్కుడు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

పొదిలి : ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మార్కాపురం ఎమ్మెల్యే నాగార్జున రెడ్డి తెలిపారు. పొదిలి నగర పంచాయతీ పరిధిలోని మాదాలవారిపాలెం గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాస రెడ్డి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, మర్రిపూడి ఎంపిపి వాకా వెంకట రెడ్డి, సీనియర్ నాయకుడు గోలమారి చెన్నారెడ్డి, వైసిపి మండల, నగర పంచాయతీ అధ్యక్షుడు దుగ్గెంపూడి శ్రీనివాస్ రెడ్డి, ఎస్‌కె నూర్జహాన్ బేగం, పులగొర్ల శ్రీనివాసులు, నరసింహ పాల్గొన్నారు.

బహుమతులు ఇస్తున్న నిర్వాహకులు

షటిల్ టోర్నమెంట్

ప్రజాశక్తి-సింగరాయకొండ

సింగరాయకొండ పట్టణ స్థాయిలో బాడ్మింటన్(షటిల్) టోర్నమెంట్ ఆదివారం ప్రభుత్వ జూనియర్ కాలేజీలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. ఈ పోటీలో మొత్తం 28 జట్లు తలపడ్డాయి. వారిలో మొదటి బహుమతి అల్లాడి అశోక్ – ఈర్ల చంద్రశేఖర్, ద్వితీయ బహుమతి సన్నెబోయిన కార్తీక్–పసుపులేటి పవన్, తృతీయ బహుమతి రాకేష్–రసూల్ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల సిడి కె.శంకర్‌రావు, రోటరీ క్లబ్ కోశాధికారి ఎన్‌వి.సుబ్బారావు విజేతలకు బహుమతులు అందజేశారు.

ఉత్సాహంగా షటిల్ పోటీలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం ప్రభుత్వ పాఠశాల మైదానంలోని డాక్టర్ వైఎస్సార్ క్రీడా వికాస కేంద్రంలో షటిల్ పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ పోటీల్లో 20 టీములు పాల్గొన్నాయి. పోటీల్లో ప్రథమ స్థానంలో జానీ టీం, ద్వితీయ స్థానంలో ఆది టీం, తృతీయ స్థానంలో హర్ష టీం, నాల్గవ స్థానంలో యాపిల్ టీంలు విజేతలుగా నిలిచాయి. ఈ సందర్భంగా డాక్టర్ వైఎస్సార్ క్రీడా వికాస కేంద్రం అభివృద్ధి కమిటీ చైర్మన్ నర్రెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ క్రీడా వికాస కేంద్రంలో అన్నీ క్రీడలకు సంబంధించిన పరికరాలు, సౌకర్యాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. విజేతలకు వరుసగా ప్రథమ బహుమతిగా రూ.2వేలు, ద్వితీయ బహుమతిగా రూ.1500, తృతీయ బహుమతిగా 1000, నాల్గో బహుమతిగా రూ.500 అందజేశారు.

మాట్లాడుతున్న వసంతరావు

సంచార జాతుల అభివృద్ధికి.. కేంద్రం నిధులు విడుదల చేయాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

సంచార జాతుల అభివృద్ధికి కేంద్రం నిధులు విడుదల చేయాలని బుడబుక్కల సంఘం ప్రకాశం జిల్లా అధక్షుడు బొడ్ల వసంతరావు డిమాండ్ చేశారు. సంచార జాతులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వసంతరావు మాట్లాడుతూ కేంద్రం సంచార జాతుల కోసం సీడ్ నిధులు విడుదల చేయాలన్నారు. డిఎన్‌డి డెవలప్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేసి ఐదు సంవత్సరాలు పూర్తయినప్పటికీ నేటికీ ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో సంచార జాతుల అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అన్న చందంగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో బుడబుక్కల సంఘం నాయకులు పాల్గొన్నారు.

200 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మండలంలోని ఉప్పుగుండూరులో స్టార్ ఫౌండేషన్ హైదరాబాద్ సహయ సహకారాలతో ఆరవ విడతలో భాగంగా ఆదివారం షుగర్, బిపి వ్యాధులకు డాక్టర్లు బి.రామాంజనేయులు, ఆర్.గౌతమి 200మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం నెలకు సరిపడ మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.లతరెడ్డి, ఎస్.తన్మయి, నిర్వాహకుడు విశ్రాంత హెల్త్ సూపర్ వైజర్ కె.ఎల్.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశంలో హైడ్రామా

- ఎంపిపి వర్సెస్ ఎంపిడిఒ

ప్రజాశక్తి-దరిశి

దరిశి మండల సర్వసభ్య సమావేశం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆదివారం మండల ప్రజాపరిషత్ అధ్యక్షురాలు గోళ్లపాటి సుధారాణి అధ్యక్షన నిర్వహించారు. ఈ సమావేశానికి ముందు హైడ్రామా నడిచింది. మండల సర్వసభ్య సమావేశం నిర్వహించే తేదీ తనకు తెలియకుండా ఎంపిడిఒ కె. కుసుమకుమారి నిర్ణయం తీసుకున్నారని ఎంపిపి గోళ్లపాటి సుధారాణి ఆరోపించారు. ఉదయం 11 గంటలకు సర్వసభ్య సమావేశంలో ఎంపిడిఒ కుసుమకుమారి ఒక్కరే కూర్చున్నారు. ఈ సందర్భంగా ఎంపిపి సమావేశం హాలులోకి కొంతమంది దళిత నాయకులుతో కలిసి సుధారాణి భర్త అచ్చయ్య వచ్చి తమకు చెప్పకుండా

ఎంపిపి, ఎంపిడిఓకు సర్ధిచెబుతున్న వైస్ ఎంపిపి

సమావేశం నిర్వహించడం సరైనది కాదన్నారు. ఎంపిడిఒ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఎంపిపి సుధారాణి కంట తడిపెట్టారు. దళితులమని చిన్నచూపు చూస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపిపి హాలులోకి ఎంపిడిఒ వచ్చి నేను రూలు ప్రకారమే చేశానని, పరిపాలనాధికారి నీకు తెలియపరిచానని, నేను తప్పు చేయలేదని ఎంపిడిఒ తెలిపారు. ఆ సమయంలో వైస్‌ఎంపిపి సోము దుర్గారెడ్డి కల్పించుకుని భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా చూడాలని సర్ది చెప్పారు. అనంతరం సర్వసభ్య సమావేశం కొనసాగించారు. ఎంపిపి గోళ్లపాటి సుధారాణి సమావేశం మధ్యలో లేచిపోయి ఎంపిడిఒ కారాలయం వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి దళితనాయకులతో కలిసి నిరసన తెలిపారు. ఎంపిడిఒను మార్చాలని ఎంపిపి విలేకర్లతో అన్నారు. అనంతరం ఆమె మరలా వచ్చి సభలో కూర్చున్నారు. సర్వసభ్య సమావేశం సజావుగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు సోము దుర్గారెడ్డి, కొరివి ముసలయ్య, ఎఇలు వెంకటేశ్వరరావు, చైతన్య, వేణుగోపాల్, ఎన్ఎస్‌పి డిఇ అక్బర్‌బాష, ఎంఇఒ రఘురామయ్య, డాక్టర్లు సుజిత, బసవయ్య, సిడిపిఒ భారతి, ఎఒ బాలక్రిష్ణనాయక్, ఎఎస్‌డబ్ల్యుఒ రజియా, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నిరాశలో ముందస్తు పత్తి రైతులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

పత్తి రైతుల ఆశలు ఈ సారి నిరాశే తప్పేలా లేదు. ఈ పాటికే సాగు చేసిన పత్తి పంటకకు ఎర్రనక్క తెగులు సోకడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత పది రోజులుగా మబ్బులు ఉంటూ చినుకులు రాలడంతో పత్తి కాయలు నేల రాలుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనేక ఆశలతో రైతులు ముందస్తుగా పత్తి సాగు చేశారు. పంట కోసం వేలాది రూపాయలు వెచ్చించారు. నియోజకవర్గంలో 3,500 ఎకరాల్లో పంట సాగు చేశారు. అప్పుడప్పుడు కురిసిన వర్షాలు రైతుకు కాస్త ఊరట కలిగించాయి. ఎకరాకు రూ.25 వేలు నుంచి రూ.35 వేలు వరకు రైతులు ఖర్చు చేశారు. అనుకోకుండా వచ్చిన వర్షాలతో పైరు ఏపుగా పెరిగింది. పైరు కళకళలాడుతున్న దశలో తెగులు సోకడంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఎర్రనక్క తెగులు సోకడంతో ఆకులు ఎర్రగా మారిపోతున్నాయి. తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టినా ఫలితం లేదని రైతులు అంటున్నారు. మరో వైపు పత్తి ధర కూడా గణనీయంగా

పత్తి పొలం

తగ్గింది. గతేడాది క్వింటా రూ.11 వేలు పలికిందని, ప్రస్తుతం రూ.7 వేలు కంటే ఎక్కువ లేదని రైతులు వాపోతున్నారు. పరిస్థితులు అనుకూలిస్తే ఎకరాకు 12 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ప్రస్తుతం వాతావరణం ప్రతికూలించడంతో 5 నుంచి 7 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే చేతికందే అవకాశాలున్నాయని రైతులు అంచనా వేస్తున్నారు.

జెవివి జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జెవివి నాయకులు

ప్రజాశక్తి-కనిగిరి

ఆగస్ట్ 12,13 తేదిలలో కనిగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించనున్న జెవివి జిల్లా మహాసభలను జయప్రధంచేయాలని జెవివి జిల్లా అధ్యక్షులు ఎస్‌కె ఖాజాహుస్సేన్ ,ప్రధాన కార్యదర్శి సిహెచ్ జయప్రకాష్‌లు కోరారు. స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కనిగిరి, హెచ్‌ఎంపాడు, వెలిగండ్ల, పిసిపల్లి మండలాల జెవివి కమిటీలను ఎన్నుకున్నారు. మూడ నమ్మకాలకు వ్యతిరేకంగా శాస్త్రీయ విజ్ఞానాన్ని ప్రచారంచేస్తూ శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందిస్తూ జెవివి కృషి చేస్తుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వి మాలకొండారెడ్డి, కె కృష్ణమూర్తి, వి నాగిరెడ్డి, ఎం బ్రహ్మయ్య, జి.శ్రీనివాసులు, బషీర్ ఉన్నీసాబేగం, గిరిజ, ఎస్‌కె గౌస్, ఎస్‌కె ఖాజారహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

బీట్ అధికారికి ఉత్తమ ప్రతిభా పురస్కారం

మంత్రి రామచంద్రారెడ్డి చేతుల మీదుగా అవార్డు అందజేత

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలంలోని గంజివారిపల్లి అటవీ శాఖ కార్యాలయం పరిధిలో గల రేగుమానుపెంట బీట్ అధికారిగా పని చేస్తున్న నాగం రోశయ్యకు శనివారం అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా ఉత్తమ ప్రతిభా పురస్కారం లభించింది. అనతి కాలంలోనే అసాధారణ పనితీరు కనబరుస్తూ అటవీ రక్షణ, వన్యప్రాణుల సంరక్షణను సమూర్ధవంతంగా నిర్వహించినందుకు గాను ఈ పురస్కానికి ఎంపిక చేశారు. నల్లమల అడవిలో అత్యంత కష్టతరమైన ప్రదేశాలలో తిరుగుతూ పులుల జాడలను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ, జంతు, మానవ సంఘర్షణ వల్ల పులుల ఆవాసాలకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండ ఉండుటలో ప్రధాన భూమిక పోషించారు. ఈ నేపథ్యంలో తిరుపతిలో నిర్వహించిన కార్యక్రమంలో అటవీ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రం, జ్ఞాపికను అందుకున్నారు. ఈ సంధర్భంగా నాగం రోశయ్య మాట్లాడుతూ అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ టైగర్, మార్కాపురం డివిజన్ డిప్యూటి డైరెక్టర్ విఘ్నేష్ అప్పావ్, గంజివారిపల్లి అటవీక్షేత్రాధికారి యస్‌వి సుబ్బారావు, సీనియర్ సహాయకులు కామేశ్వరరావు, గంజివారిపల్లె సెక్షన్ అధికారి పి శ్రీనివాసరావులు రోశయ్యను అభినందించారు.

గ్రంధాలయాల ద్వారా విజ్ఞానం

ప్రజాశక్తి-టంగుటూరు

గ్రంధాలయాల ద్వారా విద్యార్థులకు ఎంతో విజ్ఞానం లభిస్తుందని టంగుటూరు గ్రంథ పాలకుడు గుమ్మడి వర్ధనరాజు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక శాఖా గ్రంధాలయంలో చదవడం నాకిష్టం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థినీ, విద్యార్థులు గ్రంధాలయానికి వచ్చి పుస్తకాలను తీసుకొని చదువుకున్నారు. వర్ధనరాజు మాట్లాడుతూ గ్రామస్తులందరూ తమ పిల్లలను గ్రంధాలయాలకు పంపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వర్ధనరాజుతో పాటు విద్యార్థినీ, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మంత్రిని సన్మానిస్తున బ్యాంక్ చైర్మన్ ప్రసాద్‌రెడ్డి

మంత్రిని కలిసిన పిడిసిసి చైర్మన్

ప్రజాశక్తి-కనిగిరి

రాష్ట్ర మున్సిపల్ శాఖామంత్రి ఆదిమూలపు సురేష్‌ను మార్కాపురంలోని ఆయన నివాసంలో పిడిసిసి బ్యాంక్ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. జిల్లాలోని రైతుల సంక్షేమం కోసం తాను కృషి చేస్తున్నాని ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆయన వెంట జిల్లా రైతు అధ్యక్షులు సూరసాని మోహన్‌రెడ్డి, ఏజిపి ఎస్ శ్రీనివాసులరెడ్డి, మార్కాపురం మున్సిపల్ చైర్మన్ మురళీకృష్ణ, ఎర్రగొండపాలెం ఏఎంసీ చైర్మన్ ఉడుమల శ్రీనివాసులురెడ్డి, వైసీపీ నాయకులు దాదిరెడ్డి, మాలకొండారెడ్డి పాల్గొన్నారు.

34 సార్లు రక్తదానం, మూడు సార్లు రక్తకణాల దానం

ప్రజాశక్తి-కొమరోలు

ప్రకాశం జిల్లా కొమరోలు మండలం నల్లగుంట్ల గ్రామానికి చెందిన చల్లా అశోక్ రెడ్డి అనే యువకుడు 34 సార్లు రక్తదానం చేసి రికార్డు సృష్టించాడు. నంధ్యాలలోని ఓ ఆసుపత్రిలో 13సంవత్సరాల బాలికకు అత్యవసరంగా రక్తకణాలు అవసరం కావడంతో అశోక్‌రెడ్డి నంద్యాల బ్లడ్ సెంటర్ నందు రక్తకణాలు ఇచ్చారు. మును ముందు కూడా రక్తదానం చేస్తానని చల్లా అశోక్ రెడ్డి చెప్పాడు. రక్తదాతలు రక్తదానం చేయాలి అనుకున్న, రక్తం అవసరమైనవారు 9959954610 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

డబుల్ సెంచరీ కొట్టిన టమాటా ధర

కిలో టమాటా రూ.200, పచ్చిమిర్చి కిలో రూ.100 ● కూరగాయలు కొనలేక ప్రజలు బెంబేలు ● ఆందోళనలో వినియోగదారులు

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

కూరగాయల ధరలకు ఒక్కసారిగా రెక్కలు వచ్చి సామాన్యుడికి అందనంటున్నాయి. రాష్ట్రంలోనే పేరుగాంచిన మార్టూరు పెద్ద కూరగాయల మార్కెట్‌లో టమాటా ధర రికార్డ్ స్థాయిలో అందనంత ఎత్తులోకి చేరింది. పచ్చిమిర్చి ధర ఘాటెక్కిస్తోంది. కొనేందుకు అన్ని వర్గాల ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. పది రోజుల వరకు కిలో రూ.120 నుంచి రూ.140 ఉన్న టమాటా ధర ఆదివారం మార్టూరు మార్కెట్‌లో రికార్డ్ స్థాయిలో రూ.200లకు చేరింది. పచ్చిమిర్చి కిలో రూ.100 ఉంది జిల్లా వ్యాప్తంగా పట్టణాల్లో.. పల్లెల్లో చూసినా ఇవే ధరలు పలుకుతున్నాయి. ఏ కూరగాయ అయినా కిలో రూ.80 నుంచి రూ.100కు తక్కువ లేదు. దీంతో కిలో కొనేవారు పావు కిలోతో సరిపెడుతున్నారు. రెండు నెలల క్రితం కురిసిన భారీ వర్షాలకు కూరగాయ తోటలు పాడవడంతో పాటు కొన్నాళ్ల పాటు కాసిన భారీ ఎండలతో దిగుబడి తగ్గిపోయింది. ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి పడిపోయి కొరత ఏర్పడటంతో ధరలు పెరిగాయని వ్యాపారస్తులు అంటున్నారు.

కిలో టమాటా రూ.200

ఈ ఏడాది ప్రారంభంలో కిలో టమాటా రూ.20కి మించలేదు. ప్రస్తుతం మార్టూరు హోల్‌సేల్ మార్కెట్‌లో నాణ్యమైన టమాటా కిలో ధర రూ.160 ఉండగా రిటైల్ మార్కెట్‌లో కిలో రూ.200కు చేరింది. పది రోజుల క్రితం వరకు 25 కిలోల బాక్స్ ధర మార్కెట్‌లో రూ.3,600 ఉండగా ఆదివారం రికార్డ్ స్థాయిలో రూ.4300 చేరడంతో గత్యంతరం లేక కిలో టమాటా రూ.200 లకు అమ్మాల్సిన పరిస్థితి ఏర్పడిందని వ్యాపారులు సైతం వాపోతున్నారు. అనిశ్చిత వాతావరణ పరిస్థితులు టమాటా సరఫరాపై ప్రభావం చూపడంతో ధరలు ఒక్కసారిగా పెరుగుతు న్నాయి. పెరిగిన ధరలతో కూరగాయలు కొనలేకపోతున్నా మని పేద, మధ్యతరగతి ప్రజలంటున్నారు. కూరగాయలు కొనటానికి మార్కెట్‌కు వెళ్లి వాటి ధరలు వింటేనే భయ మేస్తోందని, ఏ కూరగాయ ధర అడిగినా కిలో రూ.80కి తక్కువ చెప్పడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కసారిగా పెరిగిన ధరలతో టమాటా బాక్స్‌లు కొనుగోలు చేయడానికి వ్యాపారస్తులు సైతం ధైర్యం చేయడం లేదు.

అల్లం, వెల్లుల్లి ధరలకూ రెక్కలు!

అసలే టమాటా ధర చుక్కలనంటడంతో జనాలు విలవిలలాడుతుంటే వాటికి తోడు అల్లం, వెల్లుల్లి ధరలకు కూడా రెక్కలు వచ్చాయి. ఎలాటి కూరలు చేసుకోవాలన్నా అల్లం, వెల్లుల్లి ఖచ్చితంగా ప్రతి ఇంట్లో అవసరం ఉంటుంది. శాఖాహార ప్రియులైనా, మాంసాహార ప్రియులైనా రుచికరమైన వంటకాల కోసం అల్లం, వెల్లుల్లిని వినియోగిస్తుంటారు. రెండేళ్లుగా అల్లం, వెల్లుల్లి ధరలు నిలకడ గా ఉన్నప్పటికీ గత పది రోజులుగా వాటి ధరలకు రెక్కలు వచ్చాయి. కిలో అల్లం రూ.270 పలుకుతుండగా.. వెల్లుల్లి కిలో రూ.170కి చేరుకుంది. వ్యాపారులు మాత్రం అల్లం, వెల్లుల్లి పంట దిగుబడి తగ్గడంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి కూడా తగ్గడంతో ధరలు పెరిగాయని చెబుతున్నారు.



నివాళులు అర్పిస్తున్న టిడిపి ఇన్‌ఛార్జ్ ఎంఎం కొండయ్య (ఇన్‌సెట్‌లో) సిద్ధి భవాని (ఫైల్)

వస్త్ర వ్యాపారి బుచ్చేశ్వరరావుకు మాతృవియోగం

పరామర్శించిన టిడిపి ఇన్‌ఛార్జి ఎంఎం కొండయ్య

ప్రజాశక్తి-చీరాల

ప్రముఖ వస్త్ర వ్యాపారి ఆల్ ఇండియా వివర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి మరియు బాపట్ల జిల్లా ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ కోశాధికారి సిద్ధి వెంకట బుచ్చేశ్వరరావు మాతృమూర్తి సిద్ధి భవాని (75) మృతి చెందారు. మండలంలోని దేవాంగపురి పంచాయతీలో నివాసం ఉంటున్న ఆమె గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతూ శనివారం అర్ధరాత్రి తీవ్ర అనారోగ్యానికి గురై మృతి చెందారు. ఈ విషయం తెలిసిన టిడిపి చీరాల నియోజకవర్గ ఇన్చార్జి ఎంఎం కొండయ్య ఆయన కుమారుడు గౌరీ అమర్నాథ్, టిడిపి చీరాల నియోజకవర్గ పరిశీలకులు చిలక లూరిపేట టిడిపి నాయకులు ఉమామహేశ్వర రావులు ఆమె మృతదేహానికి పూలదండలు వేసి నివాళి అర్పించారు. బుచ్చేశ్వరరావును కుటుంబ సభ్యులను వారు పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడు నాయకులకు, కార్యకర్తలకు అందరికీ అండగా ఉంటుందని అధైర్య పడవద్దు అని అన్నారు. అదేవిధంగా పలువురు ప్రముఖులు నివాళులు అర్పించారు. టిడిపి ఇన్‌ఛార్జి ఎంఎం కొండయ్య వెంట యాసిన్, చీరాల టిడిపి నాయకులు కౌతరపు జనార్ధన్, గజవల్లి శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, పృథ్వీ లలిత మోహన్‌రావు, రాంబాబు తదితరులు బుజ్జేశ్వరరావు తల్లి సిద్ధి భవాని మృతదేహానికి నివాళులర్పించి సంతాపం తెలియజేశారు.

గీత కార్మిక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి

యువగళం పాదయాత్రలో లోకేష్‌కు వినతి

ప్రజాశక్తి-పంగులూరు

ప్రస్తుత ప్రభుత్వం గీత కార్మికులను పట్టించుకోవడంలేదని, గీత కార్మికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, దీని పరిష్కారానికి తెలుగుదేశం ప్రభుత్వంలో గీత కార్మిక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని, తెలుగునాడు గీత కార్మిక సంఘం కోరింది. యువగళం పాదయాత్రలో భాగంగా, అద్దంకిలో ఉన్న తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలుగునాడు గీత కార్మిక సంఘం రాష్ట్ర సాధికారత సభ్యుడు దాసరి హనుమంతరావు గౌడు మాట్లాడుతూ, గీత కార్మికులు ప్రస్తుత ప్రభుత్వంలో అనేక ఇబ్బందులు పడుతున్నారని, పక్షపాత ధోరణితో పెన్షన్లు కూడా తీసివేశారని తెలిపారు. కరోనా సమయంలో గీత కార్మికులకు ఎలాంటి సహాయ సహకారాలు ఈ ప్రభుత్వం అందించలేదని హనుమంతరావు గౌడ్ తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వం రావడంతోనే గీత కార్మికులకు హక్కులు కల్పించి, ఆసరాగా నిలవాలని లోకేష్‌ను కోరారు. గీత కార్మికుల వత్తి పరిరక్షణకు నీరా పరిశ్రమను ఏర్పాటు చేయాలని, గౌడ కులస్తులకు బ్రాందీ షాపులలో 25 శాతం షాపులను కేటాయించాలని, గీత కార్మికులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని, కాల్వ గట్టులపై, ప్రభుత్వ భూములను, బంజరు భూముల్లోనూ కాంబోడియా విత్తనాలు నాటి, తాటి, ఈత వనాలు పెంచుతామని భరోసా ఇచ్చి, గీత కార్మికులకు అండగా ఉండాలని, గౌడులకు గీత కార్మికులకు తెలుగుదేశం పార్టీ భరోసా ఇస్తుందని, రాబోయే ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టాలని హనుమంతరావు గౌడ్ కోరారు.

లక్ష్మీపురంలో న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి-వేటపాలెం: మండల న్యాయ సేవాధికార సంస్థ, చీరాల వారి ఆధ్వర్యంలో మండల పరిధిలోని అక్కాయపాలెం పంచాయతీ, లక్ష్మీపురం శ్రీవెంకటేశ్వరస్వామి గుడి వద్ద ఆదివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించబడింది. మానవ అక్రమ రవాణా, నెగోషియబుల్ ఇనుస్ట్రుమెంట్ యాక్ట్, బాల్యవివాహాలు, బాలకార్మిక వ్యవస్థ, లోక్ అదాలత్, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం తదితర విషయాలను గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ అడ్వకేట్లు, ఏ సతీష్‌రెడ్డి, యు స్నేహ, ఎంజిఎన్‌ఆర్‌ఇజి ఎస్‌ఈసి ఆనంద్ బాబు, పివిఎల్‌ఎస్ డి మతీన్, వివోఏ సిహెచ్ సులోచన, గ్రామస్తులు పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న వర్ల దేవదాసు

ఎమ్మార్పీఎస్ విశ్వరూప మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-భట్టిప్రోలు: ఆగస్టు రెండోవారంలో హైదరాబాదులో జరిగే మాదిగల విశ్వరూప మహాసభకు జయప్రదం చేయాలని ఉమ్మడి గుంటూరు జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు వర్ల దేవదాసు మాదిగ కోరారు. మండలంలోని పెదలంక మధ్యగూడెంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ మండల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగలంతా ఎస్‌సి వర్గీకరణకు ఐకమత్యంతో కలసి పోరాడాల్సిన సమయం ఆసన్నామయ్యిందన్నారు. ఆగస్టు 4వ తేదీ కొల్లూరుకు ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మున్నంగి నాగరాజు మాదిగ విచ్చేసి మహాసభపై సమీక్షిస్తారని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందా కృష్ణమాదిగ నేతృత్వంలో వర్గీకరణ సాధించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం వేమూరు నియోజకవర్గ అధ్యక్షులు యల్లమాటి దాసు, మండల కమిటీ సభ్యులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

ఆసిఫ్‌ను సత్కరిస్తున్న పత్తి వెంకట సుబ్బారావు

సీఏ పట్టా పొందిన ఆసిఫ్‌కు సత్కారం

ప్రజాశక్తి-వేటపాలెం: కడు సామాన్య కుటుంబం నుంచి ఉన్నత విద్యావంతుడిగా ఎదిగిన విద్యార్థి సయ్యద్ ఆసిఫ్ సిఎ విద్యలో పట్టా పొందిన సందర్భంగా జివికేసి ఎయిమ్ ఫర్ సేవ ఆశ్రమంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. 2018లో ఇంటర్మీడిట్‌లో జిల్లా స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించిన ఆసిఫ్‌లో ఉన్న పట్టుదల, లక్ష్యం గుర్తించిన తండ్రి బాషా తన లక్ష్యం వైపు అడుగులు వేయడం కోసం చేసిన కృషి ఫలితంగా, ఆసిఫ్ కూడా అంతే పట్టుదలగా తన ఆశయం వైపు అడుగులు వేయడం, అందుకు తగ్గ కృషి వల్ల ప్రతి అడుగులో ఫలితాన్ని పొందుతూ తన గమ్యస్థానం ఛార్టర్డ్ అకౌంటెంట్ విద్యలో పట్టా పొందాడు. పట్టభద్రుల సంఘం అధ్యక్షుడు ప్రత్తి వెంకట సుబ్బారావు, సంఘం ప్రధాన కార్యదర్శి సుంకర వెంకట లక్ష్మీ ప్రసాద్, ఐటీడీఏ – శ్రీశైలం ప్రాజెక్ట్ ఫీల్డ్ ఆఫీసర్ షేక్ కమృద్దీన్ తదితరులు మాట్లాడుతూ ఆసిఫ్ విద్యార్థులకు స్ఫూర్తిదాయకుడని అన్నారు. ఆశ్రమం నిర్వాహకులు రాఘవేంద్రస్వామి మాట్లాడారు. సంఘం అధ్యక్షులు, సభ్యులు ఆసిఫ్‌కు పూలమాలలు వేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి సజ్జ శ్రీధర్‌రావు, సంఘం సహాయ కార్యదర్శి చుండూరు నాగాంజనేయులు, సభ్యులు నాగరాజ్, ప్రత్తి శరత్ బాబు, చుండూరు మురళీకష్ణ, రావి మస్తాన్ రెడ్డి, గుడుమూటీ శేఖర్‌బాబు, కరీం, షేక్ అనిఫ్, షేక్ షఫీ, పూల శ్రీనివాసరావు, చోడెం శ్రీనివాసరావు, సేవాశ్రం సేవక్ సుబ్రహ్మణ్యం, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బండారు నాగ ఆనంద్‌కు కరణం పరామర్శ

ప్రజాశక్తి-వేటపాలెం

అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తిని చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి ఆదివారం పరామర్శించారు. మండలంలోని దేశాయిపేట పంచాయతీ పరిధిలో బండారు నాగ ఆనంద్ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న ఎమ్మెల్యే ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో లేళ్ల శ్రీధర్, దంతం మంతు, పృథ్వీ చంద్రమోహన్, సాదు రాఘవ, బట్టా శ్రీను తదితర నాయకులు పాల్గొన్నారు.

'బాపట్ల'లో వరి సాగు ప్రారంభం

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

బాపట్ల మండలంలో ఖరీఫ్ సీజన్ రావటంతో వరి సాగు ప్రారంభమైంది. గత కొన్ని రోజులుగా విస్తారంగా కురిసిన వర్షాలతో రైతులు వ్యవసాయ పనులు చేపట్టారు. పొలాలను దుక్కి దున్ని వ్యవసాయానికి అనువుగా తయారుచేసే పనిలో పడ్డారు. ఎక్కువ శాతం వెద వరి సాగు వైపు రైతులు మొగ్గు చూపుతున్నారని మండల వ్యవసాయ అధికారి ఆర్ చంద్రశేఖర్ తెలిపారు. మండలంలో 13,206 హెక్టార్లలో వరి సాగు పంట వేస్తారని అన్నారు. ప్రస్తుతానికి 1368.61 హెక్టార్లలో వేద వరి సాగు పంట వేశారని చెప్పారు. అలాగే 56 హెక్టార్లలో నారుమళ్లు పోశారని తెలియజేశారు. ఎక్కువ శాతం రైతులు వెద వరి సాగు వైపు మొగ్గు చూపుతున్నారని అన్నారు.

ట్రాక్టర్‌పై నారును తీసుకెళ్తున్న రైతులు (ఇన్‌సెట్‌లో) ఏవో చంద్రశేఖర్

తక్కువ ఖర్చు అధిక దిగుబడి వెద సాగులో ఉంటుందని అన్నారు. ఏడు నుంచి పది వేల వరకు ఖర్చు తక్కువగా ఉంటుందన్నారు. ఇదిలా ఉండగా అప్పికట్ల పరిసర గ్రామాల రైతులు కర్లపాలెం మండలం నుంచి వరి నారును ట్రాక్టర్లపై తీసుకువెళుతున్నారు. ఎకరా వరి పంటకు సరిపోయే నారు రూ.2,500 నుంచి రూ.3 వేల వరకూ ధర పలుకుతోందన్నారు. కొందరు నారును కొనుగోలు చేస్తుండగా మరికొందరు స్థలాన్ని కౌలుకు తీసుకొని నారును తయారు చేసుకుంటున్నారని రైతులు తెలిపారు.

మణిపూర్‌లో మారణహోమం అరికట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి-టంగుటూరు

మణిపూర్‌లో మారణహోమాన్ని అరికట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు డిమాండ్ చేశారు. మణిపూర్‌లో జరుగుతున్న మారణహోమాన్ని ఖండిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ మానవత్వం మంట గలిసేలా మణిపూర్‌లో మహిళలను వివస్త్రలను చేసి సామూహిక అత్యాచారాలకు ఒడిగట్టడాన్ని యావత్ భారతదేశం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. బిజెపి పరిపాలనలో మహిళల పరిస్థితి ఎంత దయనీయంగా ఉందనే దానికి ఈ ఘటన అద్దం పడుతుందన్నారు. ఘటనకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. మణిపూర్ ముఖ్యమంత్రి బీరేంద్ర సింగ్ తన పదవి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గంటెనపల్లి శ్రీనివాసులు, కెజి. మస్తాన్, టంగుటూరు మండల కన్వీనర్ వేసుపోగు మోజెస్, నాయకులు టంగుటూరి రాము, ఎస్‌కె.మీరాస్, టి. నారాయణరావు, పి. శ్రీను, షేక్ బుడే, బి.శివయ్య, టి.సుబ్బారావు, వెంకట్రావు, మహిళా నాయకులు పాల్గొన్నారు

టంగుటూరులో నిరసన తెలియజేస్తున్న సిపిఎం, ఐద్వా సంఘం నాయకులు

ఒంగోలు సబర్బన్ : మణిపూర్‌లో మారణ హోమాన్ని అరికట్టాలని కోరుతూ ఒంగోలు నగర పరిధిలోని కొప్పోలు గ్రామంలో చర్చి పాస్టర్లు, ప్రజాస్వామిక ప్రియులు, లౌకిక వాదులు, జెవివి ఆధ్వ ర్యంలో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మణిపూర్‌లో మారణ హోమాన్ని ఆపాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జెవివి నాయకుడు డి. ప్రసాద్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.రఘురాం, రైతు సంఘం నాయకులు ఎస్. హనుమంతరావు, పెండ్యాల హను మంతరావు, సిఐటియు నాయకులు పి. శ్రీనివాసరావు సంఘీభావం తెలుపుతూ ర్యాలీ పాల్గొన్నారు. కార్యక్రమంలో చర్చిపాస్టర్లు, మహిళలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. **నాగులుప్పలపాడు :** మణిపూర్‌లో మారణహోమాన్ని అరికట్టాలని కోరుతూ మండల పరిధిలోని ఉప్పుగుండూరు గ్రామంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బస్టాండ్ కూడలి వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకుడు కాలం సుబ్బారావు మాట్లాడుతూ మణిపూర్‌లో మహిళలకు రక్షణ కల్పిస్తామని చెప్పిన ప్రధానమంత్రి నరేంద్రమోడీ పట్టించుకోక పోవడ దుర్మార్గమని తెలిపారు. మణిపూర్‌లో బిజెపి ప్రభుత్వం మహిళలకు రక్షణ కల్పించడంలో విఫలమైందని విమర్శించారు. మణిపూర్‌లో ఇప్పటికైనా మారణహోమాన్ని అరికట్టి, అందుకు కారణమైన నిందితులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మణిపూర్ ఘటనపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి, ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు నాయుడు మాట్లాడక పోవడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి జి.బసవపున్నయ్య, రమేష్ ,టి.శ్రీకాంత్ వివిధ రంగాల కార్మికులు , ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో నిరసన తెలియజేస్తున్న దృశ్యం

డ్రెయినేజీ పనులు పరిశీలన

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

స్థానిక బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ వద్ద నుంచి గోరంట్ల మల్టీప్లెక్స్ వద్ద ఉన్న డాన్ బాస్కో స్కూల్ వరకూ రూ.1కోటి వ్యయంతో నిర్మిస్తున్న డ్రెయినేజీ నిర్మాణ పనులను స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలువ నిర్మాణ పనులు పూర్తి అయితే కొన్ని ప్రాంతాల నుంచి వచ్చే మురుగునీరు, వర్షపునీరు పోతురాజు కాలువలో కలపనున్నట్లు తెలిపారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జబీల్, కార్పొరేటర్ చల్లా తిరుమలరావు, వైసిపి నగర కన్వీనర్ కటారి శంకర్, గంటా రాము, వైసిపి నాయకులు ఎందేటి రంగారావు, గండు మధు, తాళ్లపాలెం శ్రీను, రావులపల్లి శ్రీకాంత్, సత్యనారాయణరెడ్డి, జప్పుల్లా, కాంట్రాక్టర్ పోతంశెట్టి పవన్‌కుమార్ పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవటమే లక్ష్యం

- ఖరీఫ్ సాగుకు సమాయత్తం
- అందుబాటులో విత్తనాలు, ఎరువులు
- రైతు భరోసాలో పెట్టుబడి సాయం పంపిణీ
- 23 వేల సిసిఆర్‌సి కార్డుల పంపిణీకి చర్యలు
- జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు వెల్లడి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టర్

రైతులను అన్ని విధాల ఆదుకోవటమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు పేర్కొన్నారు. వర్షాలు కురుస్తుండటంతో ఖరీఫ్ సాగు పనులు ముమ్మరమైనట్లు తెలిపారు. రైతులకు అవసరమైన ఎరువులు రైతు భరోసా కేంద్రాలు, ప్రైవేట్ డీలర్ల వద్ద అందుబాటులో ఉన్నాయన్నారు. వైఎస్ఆర్ రైతు భరోసా - పిఎం కిసాన్ పథకం ద్వారా రైతులకు అవసరమైన పెట్టుబడి సాయం రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు.కౌలు రైతులకు అవసరమైన రుణ సదుపాయంతో పాటు సిసిఆర్‌సి కార్డులు పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా అందిస్తున్న రాయితీల గురించి ఆయన ప్రజాశక్తికి వివరించారు. అవనన్నీ ఆయన మాటలల్లోనే....

రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఖరీఫ్ సీజన్‌లో అన్ని విధాల సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టాం. ఈక్రాప్ బుకింగ్ చేసి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఆయా పంటలకు పరిహారం నేరుగా రైతుల ఖాతాలలోకి ప్రభుత్వం జమ చేస్తోంది.

అందుబాటులో ఎరువులు

జిల్లాలోని రైతు భరోసా కేంద్రాలు, ప్రైవేట్ డీలర్ల వద్ద మొత్తం 59,192 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయి. యూరియా 18,292 మెట్రిక్ టన్నులు డిఎపి 7177 మెట్రిక్ టన్నులు, ఎంఒపి 2,157 మెట్రిక్ టన్నులు కాంప్లెక్స్ ఎరువులు 27,574, ఎస్ఎస్‌పి 3991 మెట్రిక్ టన్నులు ఉన్నాయి. రైతు భరోసా కేంద్రాలలో యూరియా 6,576 మెట్రిక్ టన్నులు, డిఎపి 2,798 మెట్రిక్ టన్నులు, ఎంఒపి 135 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 6,944 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పి 425 మెట్రిక్ టన్నులు ఉన్నాయి. మిగిలినవి ప్రైవేట్ డీలర్ల వద్ద ఉన్నాయి.

ఈ క్రాప్‌లో పంటల నమోదు

ఈ క్రాప్ బుకింగ్‌లో వివిధ పంటలను మండల స్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు నమోదు చేస్తున్నారు. ఖరీఫ్‌లో 4,94,937 ఎకరాలు లక్ష్యం కాగా 100 శాతం చేశారు.

రైతు భరోసా ద్వారా రూ.386 కోట్లు పంపిణీ వైఎస్ఆర్ రైతు భరోసా పిఎం కిసాన్ పథకం

ముఖాముఖి

ద్వారా 13 విడతలుగా 2.86 లక్షల రైతులకు రూ.386 కోట్లు పంపిణీ చేశారు. ఒక్కో రైతుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడతకు 13,500 పెట్టుబడి సాయం అందిస్తున్నాయి. 14వ విడత రైతు భరోసా పెట్టుబడి సాయం ప్రభుత్వం అందజేసింది. దీంతో అన్నదాతలు ఖరీఫ్ పంటల సాగులో నిమగ్నమయ్యారు. కుంటాం.

23వేల సిసిఆర్‌సి కార్డులు పంపిణీకి చర్యలు

జిల్లాలో 23 వేల మంది కౌలు రైతులకు సిసిఆర్‌సి(క్రాప్ కల్టివేటర్ రైట్స్ కార్డ్) పంపిణీకి చర్యలు చేపట్టాం. ఇందులో 15,000 మందికి అందజేశాం. మరో 9,000 కార్డులను నెలాఖరులో పంపిణీ చేస్తాం. కౌలు రైతులను 4500 జాయింట్ లయబిలిటీ గ్రూపులుగా ఏర్పాటు చేసి వ్యక్తిగతంగా, కమ్యూనిటీ పరంగా రూ.23.98 కోట్ల రుణాలు బ్యాంకుల ద్వారా అందజేశాం.

197 గ్రూపులకు యంత్రాల అందజేత

వైఎస్ఆర్ యంత్ర సేవా పథకం ద్వారా రైతులకు యంత్రాలు అందజేసేందుకు చర్యలు చేపట్టాం. 205 యూనిట్లు ఇవ్వాలన్నది లక్ష్యం కాగా 195 యూనిట్లు ఇచ్చాం. కమ్యూనిటీ హైయరింగ్ సెంటర్స్ ద్వారా 197 గ్రూపులకు సగటున రూ. 9.5 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు అందజేస్తున్నాం. ట్రాక్టర్లు, మినీ కల్టివేటర్లు, స్ప్రేయర్లు, కంబైన్డ్ హార్వెస్టింగ్ మెషిన్, సీడ్ కం ఫెర్టిలైజర్ డ్రిల్ అందజేస్తున్నాం.